సంపుటి : 9
సంచిక : 279
మంగళవారం
30 జూన్ 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE





Contact For Ads:
7579339999


అమెరికా-ఇరాన్

## ఉద్రిక్తతలు


ట్రంప్ కీలక ప్రకటన



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పెరుగుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తాజా అంశాలపై చర్చించేందుకు రావాలని ఇరాన్ కోరిందన్నారు. టెహ్రాన్ అభ్యర్థన మేరకు ఖతార్ రాజధాని దోహా వేదిగా మంగళవారం సమావేశం ఉంటుందని సోషల్ మీడియాలో ఆయన పోస్టు చేశారు. ఇరుదేశాల ప్రతినిధులు మిగతా .. 2లో..

## పోస్ట్‌మ్యాన్ నిర్లక్ష్యం

2025 నుంచి ఇంట్లోనే స్పీడ్‌పోస్టు సంచులు



**చమోలీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు సకాలంలో బట్వాడా చేయాల్సిన పోస్టులను ఓ పోస్ట్‌మ్యాన్ తన ఇంట్లో దాచుకున్నాడు. ఏడాదిన్నరగా వచ్చిన పోస్టులను అందజేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. ఓ ఆధార్ కార్డు ఈ నిర్వాకాన్ని బయటపెట్టింది. ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లా తుంగేశ్వర్ ప్రాంతంలో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికంగా ఉంటున్న వినోద్ పాండే తన కుమార్తె ఆధార్ కార్డు రోడ్డుపై ఉండటాన్ని గుర్తించాడు. దీనిపై సదరు పోస్టు మ్యాన్‌ను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం మిగతా .. 2లో..

గంజాయి సాగును రికార్డు స్థాయిలో

## సున్నాకు చేర్చాం


హోం మంత్రి అనిత



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న కఠిన నిర్ణయాల వల్ల రాష్ట్రంలో గంజాయి సాగును రికార్డు స్థాయిలో దాదాపు సున్నాకు చేర్చామని, దీని కారణంగా ఏపీలో నేరాల రేటు ఏకంగా 14 శాతం తగ్గిందని ఏపీ హోంమంత్రి అనిత వెల్లడించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నెట్‌వర్క్‌ను మిగతా .. 2లో..

అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు

# గర్వపడాలి



- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలకు ఆదేశం
- రూ.50,999 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడి
- ప్రతి రెండు నెలలకు ఒకసారి పనుల పురోగతిపై సమీక్ష జరుపుతాం
- అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలు ఐకానిక్‌గా ఉండాలి
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశం గర్వించే రాజధాని అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని, ఇది కేవలం కట్టడాల నిర్మాణం కాదని, ఓ చరిత్ర నిర్మాణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో పాలుపంచుకుంటున్న కాంట్రాక్టు సంస్థలు, తాము ఒక బ్రాండ్‌ను సంపాదిస్తున్నామన్న భావనతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "హైదరాబాద్ ప్లస్‌గా అమరావతిని నిర్మిస్తున్నాం. ఇది యావత్ దేశానికి గర్వకారణంగా నిలవాలి. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా రూపుదిద్దుకుంటున్న అమరావతిలో మేం భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టర్లు పనిచేయాలి" అని సూచించారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువు కంటే ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్లు రాష్ట్రానికి ఐకానిక్ నిర్మాణాలుగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం రాజధాని పరిధిలో మిగతా .. 2లో..

ముంబై కోకిలా బెన్ ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌కు వైద్యపరీక్షలు...

# వెంటనే శస్త్రచికిత్స చేయాలన్న డాక్టర్లు

**చేతి కండరాలకు తీవ్ర గాయమైనట్టు నిర్ధారించిన వైద్యులు**
**కార్యక్రమాలు పూర్తయ్యాకే సర్జరీ చేయించుకుంటానన్న పవన్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఆయన చేతి కండరాలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే సర్జరీ చేయాలని సూచించారు. అయితే, రాష్ట్రానికి సంబంధించిన అధికారిక కార్యక్రమాలు, పరిపాలనా విధులు పూర్తయిన తర్వాతే తాను శస్త్రచికిత్స చేయించుకుంటానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సోమవారం నాడు తన భార్య అన్నా లెజినోవాతో కలిసి పవన్ ముంబై వెళ్లిన సంగతి తెలిసిందే. ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌కు వైద్య పరీక్షలు పూర్తయ్యాయి. ఆయన రెండు భుజాలను క్షుణ్ణంగా పరీక్షించిన వైద్య బృందం, రొటేటర్ కఫ్‌తో పాటు చేతికి సంబంధించిన రెండు కండరాలకు తీవ్ర గాయమైనట్టు గుర్తించింది. గాయం తీవ్రత ఎక్కువగా ఉన్నందున, తక్షణమే శస్త్రచికిత్స చేయించుకోవడం ఉత్తమమని వైద్యులు సిఫార్సు చేశారు. ఈ మేరకు ఆయనకు పూర్తి నివేదికను మిగతా .. 2లో..

జగన్ పాలనలో రాయలసీమలో

## రక్తపుటేరులు పారాయి

**మంత్రి బీసీ జనార్దన్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి బీసీ జనార్దన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్ పాలనలో రాయలసీమలో రక్తపుటేరులు పారాయని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రాయలసీమ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని... ఇక్కడ పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా మిగతా .. 2లో..

కష్టపడి చదవండి..

## మీ కలలు నెరవేర్చే బాధ్యత నాది

**షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో విద్యార్థుల సమస్యలు విని తక్షణ సాయంపై హామీలు**
**ప్రతి నియోజకవర్గంలో ఒక మోడల్ స్కూలు ఏర్పాటు చేయడమే లక్ష్యమని వెల్లడి**
**రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్**



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** "మీరు కష్టపడి చదవండి.. విద్యాశాఖ మంత్రిగా మీ కలలను సాకారం చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తాను" అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. సమాజంలో మార్పు కోసం యువత రాజకీయాల్లోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని సీఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. గత ఏడాది టెన్త్, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం ఆద్యంతం స్ఫూర్తిదాయకంగా, ఆసక్తికరంగా సాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 'డ్రీమ్ వాల్స్', 'గ్రాటిట్యూడ్ వాల్స్'పై విద్యార్థులు రాసిన మాటలు తనను ఎంతగానో మిగతా .. 2లో..

మూసీ ప్రాజెక్టు..
పరిహారం, పునరావాసంలో

## రాజీ లేదు

తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మూసీ ప్రాజెక్టుతో ఎవరికీ అన్యాయం జరగనీయబోమని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మానవీయ కోణంలో భూసేకరణ చేయాలని అధికారులను ఆయన మిగతా .. 2లో..

నేను ఆత్మకథ రాస్తే చాలా నిజాలు బయటకొస్తాయి..

## చాలామందికి ఇబ్బందులు

**విజయవాడలో 'వెంకయ్య నాయకుడు' పుస్తకావిష్కరణలో కీలక వ్యాఖ్యలు**
**మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు**



**విశ్వం వాయిస్ న్యూస్ :** తాను ఆత్మకథ రాస్తే ఎన్నో నిజాలు బయటపెట్టాల్సి ఉంటుందని, ఆ నిజాలు చాలామందికి నచ్చకపోవచ్చని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అందుకే తాను ఆత్మకథ రాయడం లేదని స్పష్టం చేశారు. విజయవాడలో సీనియర్ జర్నలిస్ట్ మాశర్మ రచించిన 'వెంకయ్య నాయకుడు' పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. "చాలామంది నన్ను ఆత్మకథ రాయమని అడిగారు. కానీ నేను రాస్తే ఎన్నో విషయాలు, నిజాలు చెప్పాల్సి ఉంటుంది. అవి కొందరికి ఇబ్బంది కలిగించవచ్చు. అందుకే నేను రాయలేదు. అయితే, నా జీవితానుభవాలు ఇతరులకు, ముఖ్యంగా యువతకు ఉపయోగపడాలన్న ఉద్దేశంతో మాశర్మ అడిగినప్పుడు ఈ పుస్తకానికి మిగతా .. 2లో..

స్వామి వారి చిత్రపటాలు

## చెత్తకుప్పల్లో పడేశారు

**వైసీపీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి**



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** టీటీడీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, విజిలెన్స్ పూర్తిగా విఫలమయిందని వైసీపీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామి వారి చిత్రపటాలు చెత్త కుప్పల్లో, మలమూత్రాల మధ్య పడేశారని, దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. "అలిపిరి నుంచి కిలోమీటర్ పరిధిలో స్వామి వారి స్థలాల్లో పవిత్రంగా ఉండాల్సిన చోట టీటీడీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. వందల, వేల స్వామి వారి ఫొటోలు చెత్త, మలమూత్రాలు, బీరు బాటిల్స్ మధ్య పడేశారు. ఇది టీటీడీ వైఫల్యం. విజిలెన్స్ పూర్తిగా మిగతా .. 2లో..

వాళ్ల కోసమే పవన్

## పంచాయతీరాజ్ శాఖ తీసుకున్నారు

**జనసేన అగ్రనేత, ఎమ్మెల్సీ నాగబాబు**




**అరకు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో పార్టీ బలోపేతంపై జనసేన పూర్తి స్థాయిలో దృష్టి సారించిన సంగతి తెలిసిందే. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా జనసేన పార్టీ రాబోయే ఎన్నికల నేపథ్యంలో సరికొత్త వ్యూహాలతో ముందుకు వెళుతోంది. అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్నట్లు మిగతా .. 2లో..

నా సొంత స్థలాన్ని ఆక్రమించుకుని

## వైసీపీ కార్యాలయం కట్టారు

**గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు**



**విజయనగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వం తన సొంత స్థలాన్ని అక్రమంగా లాక్కుందని గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు మండిపడ్డారు. రాత్రికి రాత్రే తన స్థలాన్ని ప్రభుత్వ భూమిగా మార్చేసి, అక్కడ వైసీపీ జిల్లా కార్యాలయాన్ని నిర్మించారని తెలిపారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని... తన ప్రైవేట్ ఆస్తిని ప్రభుత్వ భూమిగా మార్చేశారని అన్నారు. అలా మార్చిన స్థలంలో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే మున్సిపల్ రూల్స్ బ్రేక్ చేస్తూ వైసీపీ కార్యాలయాన్ని నిర్మించారని దుయ్యబట్టారు. దీనిపై గత సంవత్సరమే తాను మిగతా .. 2లో..




## 'తీస్తా' ప్రాజెక్టులో బంగ్లాదేశ్‌కు సహకరిస్తాం : చైనా



**విశ్వం వాయిస్ న్యూస్ :** 'తీస్తా నది సమగ్ర నిర్వహణ, పునరుద్ధరణ ప్రాజెక్టు'కు సంబంధించి భారత్‌నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో చైనా స్పందించింది. బంగ్లాకు తన సహకారాన్ని పునరుద్ఘాటించింది. ఈ విషయంలో మూడో పక్షం ప్రభావం తమపై ఉండదని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ తెలిపారు. 'తీస్తా'ను మిగతా .. 2లో..

రైతు భరోసా పంపిణీ పూర్తయిన తర్వాత

## 'రైతు ఆశీర్వాద సభ'

**ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**



**చింతకాని, ఎర్రుపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** తీవ్ర వర్షాల నేపథ్యంలో ఈనెల 30న చింతకాని మండలం మత్కేపల్లి అడ్డరోడ్డు వద్ద సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనబోయే రైతు ఆశీర్వాద సభను వాయిదా వేసినట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు గర్వపడాలి

రూ.50,999 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్‌ఫ్రా, ఎల్పీఎస్ ఇన్‌ఫ్రాతో పాటు కీలకమైన ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు. పనుల వేగవంతానికి అవసరమైన యంత్రాలు, మానవ వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5,140కి పైగా భారీ యంత్రాలు పనుల్లో నిమగ్నమై ఉన్నాయని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ముఖ్యమంత్రికి వివరించారు. భవిష్యత్తులో వరద ముంపు సమస్యలు తలెత్తకుండా కొండవీటి వాగు, పాలవాగులను వెడల్పు చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేశారని, రెండేళ్లుగా తాము మళ్లీ పనులను గాడిలో పెట్టామని చంద్రబాబు గుర్తుచేశారు. దేశంలోని పవిత్ర క్షేత్రాల నుంచి మట్టి, నీరు తెచ్చి పునీతం చేసిన ఈ ప్రాంతంలో నిర్మాణాలను అడ్డుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, అయినా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించేందుకు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం అవుతానని తెలిపారు. నిర్మాణాలు పూర్తయ్యాక, ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈ సమీక్షలో సీఆర్డీఏ అధికారులు, వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు

ఇందులో పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో తుది ఒప్పందంపైనా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఖతార్‌లో ఈ వారం ఇరాన్- అమెరికా బృందాల మధ్య సమావేశాలు నిర్వహించే ప్రణాళికలేవీ లేవని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరిబబాడి పేర్కొన్నారు. తమ హామీల అమలుకు సంబంధించి అమెరికా తీసుకుంటున్న చర్యల పర్యవేక్షణ, ఖతార్‌తో సంప్రదింపులు యథావిధిగా కొనసాగుతున్నాయని అన్నారు. అయితే దోహాలో మంగళవారం ఇరుదేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరగనున్నట్లు వస్తున్న వార్తలను తాము ధ్రువీకరించలేమని తెలిపారు. పరిస్థితులు చక్కబడిన తర్వాతే చర్చలు జరుగుతాయని స్పష్టం చేశారు.

## పోస్ట్‌మ్యాన్ నిర్లక్ష్యం

చెప్పడంతో ఈ ఉదంతం బయటపడింది. దీంతో గ్రామస్థులు పోస్టుమ్యాన్ ఇంటికి వెళ్లి పరిశీలించగా భారీ మొత్తంలో పంపిణీ కాని పోస్టు సంచులు బయటపడ్డాయి. ఆధార్, పాన్, బ్యాంకు ఏటీఎం కార్డులు, బ్యాంకింగ్ పత్రాలు, స్పీడ్‌పోస్ట్ ద్వారా పంపిన కీలక లేఖలు, ఇతర అధికారిక పత్రాలు పెద్ద సంఖ్యలో అందులో ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఏడాదిన్నరగా తమకు అందాల్సిన పత్రాలు పంపిణీ సక్రమంగా జరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పంపిణీ చేయకుండా ఇలా పోస్టులను ఇంట్లో ఉంచడం నిబంధనలకు విరుద్ధమని, విచారణ పూర్తిచేసి సంబంధిత ఉద్యోగిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చమోలీ పోస్టాఫీసు సూపరింటెండెంట్ అజయ్ వెల్లడించారు.

## సున్నాకు చేర్చాం

కూకటి వేళ్లతో పెకలించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వింగ్ 'ఈగల్' టాస్క్‌ఫోర్స్ క్షేత్రస్థాయిలో అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందని హోంమంత్రి కొనియాడారు. ఈ స్పెషల్ ఆపరేషన్ల ద్వారా ఇప్పటివరకు దాదాపు 1.20 లక్షల కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, శాస్త్రీయ పద్ధతుల్లో పూర్తిగా దహనం చేసినట్లు తెలిపారు. కేవలం మత్తు పదార్థాలను సీజ్ చేయడమే కాకుండా... అంతరాష్ట్ర స్మగ్లర్లకు చెందిన సుమారు రూ. 24 కోట్ల విలువైన ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసిందని వెల్లడించారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు మాఫియాపై ఉక్కుపాదం మోపేలా రాబోయే రోజుల్లో ఏజెన్సీ ఏరియాల్లో తనిఖీలను మరింత తీవ్రతరం చేస్తామని, డ్రగ్స్ సమాచారాన్ని గోప్యంగా అందించడానికి 'ఈగల్' కొత్త వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చామని అనిత తెలిపారు.

## మీ కలలు నెరవేర్చే బాధ్యత నాది

ఆకట్టుకున్నాయని లోకేశ్ తెలిపారు. విద్యార్థులు అద్భుతమైన సలహాలు ఇచ్చారని, వారిలో కొంతమంది అయినా రాజకీయాల్లోకి వస్తేనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. తాను రాజకీయాల్లో ఉండటం వల్లే దేశంలో ఏ రాష్ట్రంలో లేని విద్యా సంస్కరణలు ఏపీలో తీసుకురాగలుగుతున్నానని అన్నారు.

**త్వరలో ఏఐ ట్యూటర్.. బలోపేతం కానున్న గ్రంథాలయాలు**

వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ ఆకాంక్షలు, సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కాకినాడకు చెందిన క్రాంతి అనే విద్యార్థి స్కూలు స్థాయి నుంచే కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై శిక్షణ, మోటివేషన్ క్లాసులు, లైబ్రరీల అవసరాన్ని ప్రస్తావించారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలను ప్రక్షాళన చేస్తున్నామని, పుస్తకాలు చదవడం ద్వారా సృజనాత్మకత పెరుగుతుందని అన్నారు. మండలం, నియోజకవర్గం, జిల్లా, జోనల్ స్థాయిలో లైబ్రరీలను బలోపేతం చేస్తామని, ఏడాదిలోగా అమరావతిలో ప్రపంచస్థాయి గ్రంథాలయాన్ని నిర్మించబోతున్నామని హామీ ఇచ్చారు. మరో విద్యార్థిని అన్నపూర్ణేశ్వరి ఎన్‌సీసీ, కంప్యూటర్ ల్యాబ్ కావాలని కోరగా, త్వరలోనే రాష్ట్రంలోకి ఏఐ ట్యూటర్‌ను తీసుకువస్తున్నామని, అలాగే ఏపీకి ప్రత్యేకంగా ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్‌ను కేంద్రం మంజూరు చేసిందని శుభవార్త తెలిపారు.

**విద్యార్థుల భావోద్వేగ కథలు.. మంత్రి భరోసా**

కార్యక్రమంలో పలువురు విద్యార్థులు తమ వ్యక్తిగత కష్టాలను, ఉన్నత లక్ష్యాలను పంచుకున్నారు. కదిరికి చెందిన షేక్ చాందిని, ఇంటర్‌లో 1000కి 991 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచానని, తన తండ్రి గుండె జబ్బుతో బాధపడుతున్నారని, ఆయన కోసమే కార్డియాలజిస్ట్ కావాలనుకుంటున్నానని తెలిపింది. నీట్ కోసం కోచింగ్ ఇప్పించాలని కోరగా, అందుకు పూర్తి సహాయం అందిస్తానని లోకేశ్ భరోసా ఇచ్చారు. టెక్కలికి చెందిన అనన్యశ్రీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, భవిష్యత్తులో ఐఏఎస్ అధికారిణిగా విజన్ 2047 సాధనకు కృషి చేస్తానని చెప్పింది. ఆత్మకూరుకు చెందిన షేక్ అనీషా, పాఠశాల స్థాయి నుంచే పోటీపరీక్షలకు శిక్షణ ఇవ్వాలని కోరగా, రాబోయే ఐదేళ్లలో 10, 11, 12 తరగతుల విద్యార్థులు చదువుతో పాటు కాంపిటీటివ్ పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రణాళిక రచిస్తామని లోకేష్ వెల్లడించారు. ప్రకాశం జిల్లా విద్యార్థి పవన్ సాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ కోరగా.. రాబోయేది ఏఐ విప్లవమని, పాఠశాల స్థాయి నుంచే ఏఐ ల్యాబ్స్, ఫండమెంటల్స్‌పై శిక్షణ ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**చదువు మధ్యలో ఆగకూడదు.. అండగా ఉంటా**

అనంతపురం జిల్లా నార్పలకు చెందిన మనీష, తన తండ్రి చదివించలేని పరిస్థితుల్లో ఉన్నారని కన్నీటిపర్యంతమవ్వగా, మంత్రి లోకేష్ చలించిపోయారు. "ధైర్యంగా ఉండు, నీ చదువుకు నేను సాయం చేస్తా" అని హామీ ఇచ్చారు. కుటుంబ పరిస్థితుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువు మధ్యలో ఆపకూడదనేదే తన లక్ష్యమని, అలాంటి వారిని గుర్తించి చేయూతనిస్తామని చెప్పారు.ప్రకాశం జిల్లాకు చెందిన భాగ్యం అనే విద్యార్థిని, చిన్నతనంలోనే పెళ్లయినా ఆరేళ్ల తర్వాత మళ్లీ చదువు ప్రారంభించి ఒకేషనల్ కోర్సులో 990 మార్కులతో టాపర్‌గా నిలిచానని, ఇప్పుడు డిగ్రీ చదవాలని ఉందని చెప్పగా, ఆమెకు కూడా సాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఓ విద్యార్థిని అడిగిన ప్రశ్నకు సమాధానంగా, తాను ఎప్పుడూ బట్టీ కొట్టలేదని, తన బలం అప్లికేషన్, ఎగ్జిక్యూషన్, క్రిటికల్ థింకింగ్ అని లోకేశ్ తన విద్యార్థి జీవితాన్ని గుర్తుచేసుకున్నారు. శంఖవరం విద్యార్థిని స్వాతి తన గ్రామంలోని రోడ్డు దశాబ్దాలుగా అధ్వానంగా ఉందని చెప్పగా, మూడు నాలుగు నెలల్లో రోడ్డు వేయిస్తానని మాట ఇచ్చారు. విద్యార్థులకు శారీరక విద్యతో పాటు మానసిక ఆరోగ్య అవగాహన కూడా కల్పించాలని విశాఖ విద్యార్థి శ్రీహర్ష చేసిన సూచనను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమం కేవలం సత్కారాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలకు, ప్రభుత్వ విధాన రూపకల్పనకు వారధిగా నిలిచింది.

## మూసీ ప్రాజెక్టు.. పరిహారం, పునరావాసంలో రాజీలేదు

ఆదేశించారు. మూసీ ప్రాజెక్టు భూసేకరణ, పునరావాసంపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇళ్లు కోల్పోయేవారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలన్నారు. భూములు కోల్పోయే వారికి పరిహారం, పునరావాసంలో రాజీ ఉండదని పొంగులేటి స్పష్టం చేశారు.

## చాలామందికి ఇబ్బందులు

అంగీకరించాను" అని వివరించారు.

**విభజన, రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు**

రాష్ట్ర విభజన పరిణామాలపైనా వెంకయ్యనాయుడు స్పందించారు. 2014కు ముందే రాష్ట్ర విభజన జరిగి ఉంటే ఆంధ్రప్రదేశ్ ఎంతో అభివృద్ధి చెంది ఉండేదని అభిప్రాయపడ్డారు. ఆనాటి రాజకీయ కారణాల వల్ల అది సాధ్యపడలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ, విభజన తర్వాత తాను కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో దేశంలో ఏ రాష్ట్రానికీ ఇవ్వనన్ని నిధులు, ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేలా కృషి చేశానని గుర్తుచేశారు. ప్రస్తుత రాజకీయాలపై మాట్లాడుతూ.. రాజకీయ నేతలు తమ ప్రవర్తనపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తేనే ప్రజలకు మంచి జరుగుతుందని సూచించారు.

**స్ఫూర్తిదాయకం 'వెంకయ్య నాయకుడు'**

'వెంకయ్య నాయకుడు' పుస్తకంలో వెంకయ్యనాయుడి రాజకీయ ప్రస్థానాన్ని సమగ్రంగా పొందుపరిచారు. ఒక సాధారణ రైతు కుటుంబం నుంచి విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చి, అనేక ఉన్నత పదవులు అధిరోహించి, దేశ ఉపరాష్ట్రపతి స్థాయికి ఎలా ఎదిగారో వివరించారు. ప్రజాసేవ, మాతృభాషపై ఆయనకున్న ప్రేమ, క్లిష్ట పరిస్థితులను అధిగమించిన తీరు వంటి అంశాలు యువతకు స్ఫూర్తినిస్తాయని సభలో పాల్గొన్న వక్తలు ప్రశంసించారు. ఈ పుస్తకం విలువలతో కూడిన ఒక గొప్ప ప్రయాణానికి అక్షరరూపమని కొనియాడారు.

# పరీక్షల పారదర్శకత : విద్యా వ్యవస్థకు జీవనరేఖ

భారదేశంలో విద్యా వ్యవస్థ కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తును, వారి జీవితాలను నిర్ణయించే ఒక శక్తివంతమైన సాధనం. పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించే పరీక్షలు కేవలం విద్యార్థుల విద్యా స్థాయిని కొలిచే మూల్యాంకన సాధనాలు మాత్రమే కాదు. అవి విద్యార్థి నిజాయితీకి, అతని నిరంతర కృషికి, మరియు సామర్థ్యానికి నిలువుటద్దాలుగా నిలుస్తాయి. అలాంటి పరీక్షలు అత్యంత పారదర్శకంగా నిర్వహించబడినప్పుడే అవి సమాజంలో న్యాయంగా, విశ్వసనీయంగా గుర్తింపు పొందుతాయి. కానీ, నేటి ఆధునిక సమాజంలో పరీక్షల పారదర్శకత అనే విషయంపై పెద్ద ఎత్తున ఆందోళనలు, విస్తృత చర్చలు జరుగుతున్నాయి.పారదర్శకత అనేది కేవలం ఒక పరిపాలనా సూత్రం మాత్రమే కాదు అది ప్రతి విద్యార్థి ప్రాథమిక హక్కు, మరియు ఒక న్యాయమైన సమాజపు అత్యున్నత బాధ్యత.

పారదర్శకత అంటే అసలు ఏమిటి? పరీక్షల నిర్వహణలో పారదర్శకత అనేది ఒక బహుముఖీన భావన. ప్రశ్నపత్రాల రహస్యాన్ని అత్యంత సురక్షితంగా ఉంచడం, పరీక్షా కేంద్రాల్లో నిఘా వ్యవస్థను పకడ్బందీగా ఏర్పాటు చేయడం, సమాధాన పత్రాలను నిష్పక్షపాత వైఖరితో మూల్యాంకనం చేయడం, మరియు తుది ఫలితాలను విద్యార్థులకు సకాలంలో స్పష్టంగా అందించడం ఇవన్నీ పారదర్శకతలో అంతర్భాగాలే. పారదర్శకత అంటే పరీక్షా ప్రక్రియ మొత్తం ఎటువంటి మచ్చ లేకుండా స్వచ్ఛంగా, నిజాయితీగా నిర్వహించబడటం.ఒక పరీక్షలో నిజాయితీగా కష్టపడి సాధించిన విజయం విద్యార్థికి జీవితాంతం నిలిచే గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. కానీ దురదృష్టవశాత్తూ అవినీతి, ప్రశ్నపత్రాల లీకేజీ, లేదా మూల్యాంకనంలో దొర్లే తీవ్ర దోషాల వల్ల పరీక్షా ఫలితాలు ప్రభావితమైతే, అది రాత్రింబగళ్లు కష్టపడిన పేద, మధ్యతరగతి విద్యార్థులకు తీరని అన్యాయం చేసినట్లవుతుంది. పారదర్శకత లేకపోతే సమాజానికి కలిగే నష్టాలు: పరీక్షా ప్రక్రియలో పారదర్శకత లోపించడం వల్ల వ్యవస్థలో అనేక హానికర పరిణామాలు సంభవిస్తాయి. ముందుగా, ఎంతో నిజాయితీగా చదివే ప్రతిభావంతులైన విద్యార్థులకు ఘోరమైన అన్యాయం జరుగుతుంది. వారి అపారమైన కృషి, కుటుంబాల త్యాగం, మరియు నిద్రలేమి రాత్రులు అన్నీ ఒక్కక్షణంలో వ్యర్థమవుతాయి. ప్రశ్నపత్రం ముందే లీక్ అయినా లేదా పరీక్షా కేంద్రాల్లో యథేచ్ఛగా కాపీయింగ్ జరిగినా, నిజమైన ప్రతిభావంతులు వెనుకపడిపోయే ప్రమాదం స్పష్టంగా ఉంది.గమనించవలసిన ముఖ్యమైన అంశాలు: ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షా కేంద్రాల్లో జరిగే అక్రమాలు, మూల్యాంకనంలో చూపించే వివక్ష ఇవి పారదర్శకత లేమికి ప్రధాన సంకేతాలు. వీటిని సమూలంగా నిరోధించడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, కఠినమైన నిఘా, మరియు బాధ్యతాయుతమైన జవాబుదారీతనం ఎంతైనా అవసరం.

రెండవది, పారదర్శకత లేమి అనేది మొత్తం విద్యా వ్యవస్థపై విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు ఉన్న నమ్మకాన్ని పూర్తిగా సన్నగిల్లేలా చేస్తుంది. పరీక్షా వ్యవస్థపై సమాజంలో నమ్మకం తగ్గిపోతే, ఉన్నత విద్య పట్ల ఆసక్తి కూడా క్రమంగా తగ్గిపోతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద విద్యార్థులు, వారికి అందుబాటులో ఉన్న పరిమిత వనరులతో ఎంతో కష్టపడి చదివినప్పటికీ, అవకాశాల తలుపులు అందరికీ సమానంగా తెరిచి ఉంటే మాత్రమే వారు జీవితంలో ముందుకు వెళ్లగలరు.పారదర్శకత వల్ల కలిగే అద్భుతమైన లాభాలు, నిష్పక్షపాతమైన, పారదర్శకమైన పరీక్షా వ్యవస్థ సమాజానికి అనేక రీతులుగా మేలు చేస్తుంది. మొదటిగా, దీనివల్ల సమాజంలోని ప్రతి విద్యార్థికి సమానమైన అవకాశాలు లభిస్తాయి. ధనిక, పేద, పట్టణ, లేదా గ్రామీణ అనే భేదభావాలు లేకుండా, ఎవరైనా సరే కేవలం తమ సొంత ప్రతిభ, కష్టపడే తత్వం ఆధారంగానే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు. ఇది నిజమైన సాంఘిక న్యాయానికి గట్టి దోహదపడుతుంది. రెండవది, పారదర్శకత అనేది సమాజంలో దాగి ఉన్న నిజమైన ప్రతిభను గుర్తిస్తుంది. ఒక విద్యార్థి సాధించిన సర్టిఫికెట్ అనేది నిజంగా ఆ వ్యక్తి యొక్క మేధో సామర్థ్యానికి నిదర్శనంగా ఉంటుంది, అప్పుడే ఆ చదువుకు అర్థం దక్కుతుంది. మన సమాజంలో నిజమైన ప్రతిభావంతులు సరైన స్థానాల్లోకి వచ్చినప్పుడే, మన రాష్ట్రం మరియు దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతాయి. మూడవది, ఈ పారదర్శకత విద్యా సంస్థలపై, పరీక్షా మండలులపై సమాజానికి ఉన్న గౌరవపూర్వక విశ్వాసాన్ని నిలబెడుతుంది.

ఒక న్యాయమైన పరీక్ష విద్యార్థి జీవితాన్ని ఉన్నతంగా మారుస్తుంది; కానీ అన్యాయమైన పరీక్ష ఒక తరం యువత కలలను పూర్తిగా మట్టిపాలు చేస్తుంది.సాంకేతిక పరిజ్ఞానం పారదర్శకతకు తోడ్పడే విధానం. ఆధునిక డిజిటల్ కాలంలో సాంకేతిక పరిజ్ఞానం పరీక్షల పారదర్శకతకు ఒక పెద్ద బాసటగా నిలుస్తోంది. పరీక్షా కేంద్రాలలో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు, అక్రమాలను నిరోధించే బయోమెట్రిక్ హాజరు నమోదు, కంప్యూటరైజ్డ్ ఆన్‌లైన్ మూల్యాంకన వ్యవస్థలు, మరియు రాండమైజ్డ్ ప్రశ్నపత్రాల రూపకల్పన ఇవన్నీ పరీక్షా ప్రక్రియను మరింత సురక్షితంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి అద్భుతంగా తోడ్పడుతున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశ్నపత్రాలు లీక్ అవకుండా ముందే నిరోధించడానికి ఎన్క్రిప్టెడ్ డిజిటల్ పంపిణీ వ్యవస్థలను అమలు చేయాలి.అలాగే, పరీక్షలు రాసిన విద్యార్థులకు వారి సమాధాన పత్రాల డిజిటల్ కాపీలను ఆన్‌లైన్‌లో స్వయంగా చూసుకోగలిగే సదుపాయం కల్పించడం వల్ల మూల్యాంకనంలో పారదర్శకత మరింత పెరుగుతుంది. ఒకవేళ ఎక్కడైనా పొరపాటు లేదా తప్పు జరిగిందని విద్యార్థి భావిస్తే, పునర్మూల్యాంకనానికి సులభంగా దరఖాస్తు చేసుకోగలిగే పారదర్శక అవకాశం ఉండాలి. ఇది ప్రతి విద్యార్థి న్యాయసమ్మతమైన ప్రాథమిక హక్కు.ప్రభుత్వ బాధ్యత మరియు సమాజం యొక్క క్రియాశీల పాత్ర: ఒక పారదర్శకమైన విద్యా పరీక్షా వ్యవస్థను నిర్మించడంలో ప్రభుత్వం, విద్యా సంస్థలు, పాఠశాలలు, తల్లిదండ్రులు, మరియు విద్యార్థులు అందరూ సమాన భాగస్వాములే. ప్రభుత్వం ఈ విషయమై కఠినమైన చట్టాలను రూపొందించాలి. పరీక్షా మండలులు సమాజానికి పూర్తి జవాబుదారీగా వ్యవహరించాలి. పోలీసులు, న్యాయవ్యవస్థలు పరీక్షల అక్రమాలకు వ్యతిరేకంగా ఎంతో నిర్ణయాత్మకంగా వ్యవహరించాలి. ఒకవేళ పరీక్షా అక్రమాలకు పాల్పడిన దోషులకు కఠినమైన శిక్షలు వేయకపోతే, ఇలాంటి సామాజిక నేరాలు సమాజంలో పదే పదే పునరావృతమవుతూనే ఉంటాయి.సమాజం కూడా ఈ విషయంలో తన బాధ్యతను సక్రమంగా నిర్వహించాలి. పరీక్షల్లో అక్రమాలు జరుగుతున్నాయని తెలిసినా సమాజం మౌనంగా ఉండటం అంటే, ఆ అవినీతికి పరోక్షంగా సహకరించడమే అవుతుంది. ఒక బాధ్యతాయుతమైన విద్యార్థి లేదా తల్లిదండ్రి పరీక్షల్లో జరిగే అక్రమాలను చూసినప్పుడు, వెంటనే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం తమ కనీస ప్రథమ విధి అని గుర్తించాలి.ముందుకు వెళ్లాల్సిన సంస్కరణల మార్గం. పరీక్షల పారదర్శకతను కాపాడటం కోసం తాత్కాలిక చర్యలు సరిపోవు, దీనికోసం దీర్ఘకాలిక, సమగ్రమైన విద్యా సంస్కరణలు ఎంతైనా అవసరం. ప్రశ్నపత్రాల రూపకల్పన ప్రక్రియ నుండి తుది ఫలితాల ప్రకటన వరకు ప్రతి ఒక్క దశలోనూ పటిష్టమైన నిఘా ఉండాలి. స్వతంత్ర పరీక్షా నియంత్రణ సంస్థలను ఏర్పాటు చేయడం, అంతర్జాతీయ మూల్యాంకన ప్రమాణాలను నిరంతరం అనుసరించడం, మరియు ప్రతి సంవత్సరం పరీక్షా నిర్వహణ వ్యవస్థపై సమగ్రమైన సమీక్షలు జరుపుకోవడం అత్యవసరం.

చివరగా, పారదర్శకత అనేది కేవలం కొన్ని నిబంధనలు, చట్టాలు మరియు సాంకేతిక నిఘా గురించి మాత్రమే కాదు అది మన సమాజ నైతిక విలువలపై ఆధారపడి ఉంటుంది. చిన్నతనం నుంచే విద్యార్థులకు నిజాయితీ, సత్యం, మరియు న్యాయమైన పద్ధతిలో పోటీ చేయడం వంటి నైతిక విలువలను పాఠశాలల్లో నేర్పించాలి. అప్పుడే మన సమాజం భవిష్యత్తులో నిజంగా బలమైన, అత్యంత ప్రతిభావంతమైన సరికొత్త తరాన్ని దేశానికి తయారు చేయగలదు. పరీక్షల పారదర్శకత అనేది కేవలం ఒక పరిపాలనా పరమైన అంశం మాత్రమే కాదు అది మన ఉజ్వల జాతి నిర్మాణంలో అత్యంత కీలకమైన ప్రధాన మూల స్తంభం అని ప్రతి ఒక్కరూ గ్రహించాలి.



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

## చెత్తకుప్పల్లో పడేశారు

నిద్రపోయింది" అని మండిపడ్డారు. టీటీడీని ప్రక్షాళన చేస్తున్నామని రెండేళ్లుగా చెబుతున్నారని... కానీ వాస్తం ఏమిటో కళ్లకు కట్టినట్టు కనిపిస్తోందని భూమన తెలిపారు. సనాతన ధర్మం గురించి మాట్లాడూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఒకసారి ఇక్కడకు వచ్చి చూడాలని అన్నారు. ఇదేనా మీరు చేస్తున్న ప్రక్షాళన అని ప్రశ్నించారు. ఈ అపచారాలకు చంద్రబాబు బాధ్యత వహించాలని అన్నారు. పాలకులు, టీటీడీ అధికారులు సిగ్గు పడాలని వ్యాఖ్యానించారు.

## పంచాయతీరాజ్ శాఖ తీసుకున్నారు

జనసేన అగ్రనేత, ఎమ్మెల్సీ నాగబాబు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అరకు పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ జనసేన అభ్యర్థులను నిలబెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నాగబాబు తెలిపారు. గిరిజన హక్కుల పరిరక్షణ, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖను తీసుకున్నారని చెప్పారు. కురుడి, దుంబ్రిగూడ, బల్లగరువు, పోతంగి, అనంతగిరి, పాడేరు, అరకు, పెద్దబాడు వంటి గిరిజన ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ స్వయంగా పర్యటించి సమస్యలు అర్థం చేసుకున్నారని చెప్పారు. 'అడవితల్లి బాట' కార్యక్రమం ద్వారా గిరిజన గ్రామాలకు రూ.1,005 కోట్లతో సుమారు 1,069 కిలోమీటర్ల రోడ్లు నిర్మించారని తెలిపారు. పీఎం జన్మన్ నిధుల నుంచి రూ.555 కోట్లు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.2,525 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనంగా రూ.50 కోట్లు కేటాయించి గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. బాక్సైట్ మైనింగ్, హైడ్రో ప్రాజెక్టుల విషయంలో పర్యావరణం, గిరిజనుల జీవన విధానానికి ఎలాంటి హాని కలగకుండా చూస్తామని స్పష్టం చేశారు.

## వైసీపీ కార్యాలయం కట్టారు

విజయనగరం జిల్లా కలెక్టర్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ వ్యవహారంపై తాను ప్రశ్నిస్తే... గత జగన్ ప్రభుత్వం తిరిగి తనపైనే అనేక అక్రమ కేసులు నమోదు చేసి వేధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా ఈ ల్యాండ్ స్కామ్‌ను పక్కదారి పట్టించేందుకు కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని, తాము ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటికీ సరైన చర్యలు తీసుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. విజయనగరంలోని సదరు భూ రికార్డులపై పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తన తాత ముత్తాతల కాలం నాటి సొంత భూమిని కాపాడుకునేందుకు ఎంతటి న్యాయపోరాటం చేయడానికైనా సిద్ధమేనని అన్నారు.

## 'తీస్తా' ప్రాజెక్టులో బంగ్లాదేశ్‌కు సహకరిస్తాం : చైనా

బంగ్లాదేశ్‌కు జీవనోపాధి ప్రాజెక్టుగా పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌కు మద్దతుగా తన వంతు సాయం చేయడానికి చైనా ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. అభివృద్ధి వ్యూహాలలో బంగ్లాదేశ్‌తో మరింత సమన్వయం సాధించడానికి, ఆర్థిక, వాణిజ్యం, నీటిపారుదల వంటి రంగాలలో సహకారాన్ని పెంపొందించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని గువో జియాకున్ పేర్కొన్నారు. తీస్తా ప్రాజెక్ట్‌పై ఇరు దేశాల నిపుణులు సాంకేతిక అధ్యయనం నిర్వహిస్తారని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలుర్ రెహమాన్ తెలిపారు. వ్యూహాత్మకంగా సున్నితమైన సిలిగుడి కారిడార్ (చికెన్స్ నెక్)కు ఈ నది సమీపంలో ఉన్నందున.. ఈ ప్రాజెక్టులో చైనా జోక్యం భారత్‌కు ప్రమాదకరమే. బంగ్లా- చైనా ఉమ్మడిగా కార్యకలాపాలు చేపడితే రక్షణ పరంగా ఇబ్బందులు తలెత్తుతాయని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## 'రైతు ఆశీర్వాద సభ'

తెలిపారు. సభ, పార్కింగ్ ప్రాంతాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా అధికారులతో కలిసి భట్టి విక్రమార్క సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజాభివృద్ధి కార్యక్రమాలను చూసి వరుణదేవుడు కరుణించాడని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని సీఎం సభను వాయిదా వేస్తున్నామన్నారు. రైతు భరోసా పంపిణీ పూర్తయిన అనంతరం త్వరలో 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రైతు భరోసా పథకం నిధులను హైదరాబాద్ శిల్పకళా వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం విడుదల చేయనున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీపై ప్రతిపక్ష పార్టీలు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో రైతుబంధు కింద రూ.72 వేల కోట్లు అందించగా.. ప్రజాప్రభుత్వం కేవలం రెండేళ్లలో రూ.36 వేల కోట్ల సాయం అందించిందన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతు భరోసా కింద రానున్న తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

## వెంటనే శస్త్రచికిత్స చేయాలన్న డాక్టర్లు

అందజేశారు. అయితే, వైద్యుల సూచనపై స్పందించిన పవన్ కల్యాణ్ తన నిర్ణయాన్ని వెల్లడించారు. ముందుగా నిర్దేశించుకున్న ప్రభుత్వ కార్యక్రమాలను, పరిపాలనా బాధ్యతలను పూర్తి చేయడం తన కర్తవ్యమని ఆయన భావించారు. ఈ కార్యక్రమాలన్నీ ముగిసిన తర్వాతే శస్త్రచికిత్స కోసం ఆసుపత్రిలో చేరతానని తెలిపారు. ఈ మేరకు అధికారిక కార్యక్రమాలను పూర్తి చేసుకుని తిరిగి వస్తానని ఆయన పేర్కొన్నారు. కాగా, పవన్ కల్యాణ్ గత కొంతకాలంగా చేతి నొప్పితో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. రెండు చేతుల కండరాలు పూర్తిగా దెబ్బతినడంతో పాటు, రొటేటర్ కఫ్ గాయంతో ఆయన అసౌకర్యానికి గురవుతున్నారు. ఎన్నికల ప్రచార సమయంలోనూ ఈ నొప్పి ఆయన్ను వేధించింది.

## రక్తపుటేరులు పారాయి

జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసీపీ నేతలు ఓర్చుకోలేకపోతున్నారని మండిపడ్డారు. "రప్పా.. రప్పా.. నరుకుతాం అంటూ ఫ్యాక్షన్ డైలాగులు చెబుతుంటే ఏ పారిశ్రామికవేత్త అయినా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తారా?" అని జగన్‌ను ఉద్దేశించి ఆయన ప్రశ్నించారు. ఆ భయానక వాతావరణం వల్లే గతంలో ఉన్న పరిశ్రమలు కూడా ఏపీని వదిలి పారిపోయాయని మండిపడ్డారు. డెవలప్‌మెంట్‌కు ఎప్పుడూ చంద్రబాబే బ్రాండ్ అంబాసిడర్ అని, కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కని వైసీపీ నేతలు ఈరోజు సిగ్గు లేకుండా కూటమి ప్రభుత్వంపై మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వ కార్యాచరణ వల్ల ఎన్నో కొత్త పరిశ్రమలు రాయలసీమకు క్యూ కడుతున్నాయని మంత్రి వెల్లడించారు. కేవలం పరిశ్రమలు మాత్రమే కాకుండా... సీమ ప్రాంతాన్ని ఒక మెగా 'హార్టికల్చర్ హబ్' (ఉద్యానవన హబ్) గా మారుస్తున్నట్లు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాయలసీమ ప్రజలే ఆ 'గొడ్డలి పార్టీ'కి బుద్ధి చెప్పబోతున్నారని, వారికి కనీసం డిపాజిట్లు కూడా దక్కవని జోస్యం చెప్పారు.

# ఎడిటర్ వాయిస్

## సమాజం మారాలంటే... మనలో మార్పు రావాలి

ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైనా దాని అభివృద్ధిని నిర్ణయించేది కేవలం ప్రభుత్వాలు మాత్రమే కాదు. ఆ దేశ ప్రజల ఆలోచనా విధానం, బాధ్యత, విలువలు కూడా అంతే ముఖ్యమైనవి. సమాజంలో పెరుగుతున్న అనేక సమస్యలకు మూల కారణం కేవలం వ్యవస్థల వైఫల్యం కాదు, సామాజిక బాధ్యతలో లోపం కూడా. నేటి కాలంలో మాదకద్రవ్యాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై దాడులు, బాల కార్మిక వ్యవస్థ, పర్యావరణ కాలుష్యం, సైబర్ నేరాలు, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం వంటి అనేక సమస్యలు సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. చట్టాలు ఉన్నా, శిక్షలు ఉన్నా, సమస్యలు పూర్తిగా తగ్గకపోవడం ఆలోచించాల్సిన విషయం.

ఒకవైపు హక్కుల గురించి గొంతెత్తే మనం, మరోవైపు బాధ్యతల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాం. రోడ్డుపై చెత్త వేయడం, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడం, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం, చిన్న పనికైనా లంచం ఇవ్వడం వంటి చర్యలు సమాజాన్ని బలహీనపరుస్తాయి. చిన్న తప్పును సహజంగా తీసుకోవడం, పెద్ద సమస్యలకు మార్గం వేస్తుంది.

సమాజాన్ని మార్చే శక్తి యువత చేతుల్లో ఉంది. విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, దేశభక్తి, సేవాభావం పెంపొందితే మంచి పౌరులు తయారవుతారు. కుటుంబం, పాఠశాల, మీడియా, ప్రభుత్వం కలిసి బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి.

స్వచ్ఛమైన రాజకీయాలు, పారదర్శక పాలన, అవినీతి రహిత వ్యవస్థ, చట్టాల పట్ల గౌరవం---ఇవన్నీ మంచి సమాజానికి పునాదులు. కానీ ఇవి కేవలం ప్రభుత్వ చర్యలతోనే సాధ్యం కావు. ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే నిజమైన మార్పు వస్తుంది.

సమాజం మారాలని కోరుకునే ముందు మనం మారాలి. మనలో మార్పు వస్తే కుటుంబం మారుతుంది. కుటుంబం మారితే సమాజం మారుతుంది. సమాజం మారితే దేశం అభివృద్ధి చెందుతుంది. "మార్పు కోసం ఎదురు చూడొద్దు... మార్పుకు మీరే నాంది పలకండి."



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

రెండు వాహనాల మధ్య నలిగి..

## భర్త కళ్లెదుటే భార్య దుర్మరణం




**నక్కపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం కాగిత సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. విశాఖలోని పెందుర్తికి చెందిన ఒలిపల్లి ఈశ్వరరావు, భార్య గాయత్రి(24) ద్విచక్ర వాహనంపై అన్నవరం సత్యదేవుని దర్శనానికి ఉదయం బయలుదేరారు. కాగిత వద్దకు చేరుకోగానే వెనుక వస్తున్న వ్యాన్ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న ఈశ్వరరావు కింద పడిపోగా.. గాయత్రి ఎగిరి వ్యాన్‌పై పడింది. క్షణాల్లో వ్యాను.. లారీని ఢీకొట్టడంతో రెండు వాహనాల మధ్య ఆమె నలిగి అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. భర్త స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదంతో నక్కపల్లి-తుని మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను పక్కకు తీయించారు. మృతి చెందిన మహిళను శవ పరీక్ష నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ఇంట్లో భారీ చోరీ.. 56 తులాల బంగారం మాయం

**మాచవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లా మాచవరంలో భారీ చోరీ జరిగింది. దాదాపు 56 తులాల బంగారాన్ని దుండగులు ఎత్తుకెళ్లారు. శ్రీనివాసరావు కుటుంబం హైదరాబాద్‌లోని పెద్ద కుమార్తె వద్దకు వెళ్లగా.. చిన్న కుమార్తె ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో చోరీ జరిగింది. వెండి, నగదు జోలికి వెళ్లకుండా బంగారం చోరీ చేయడంపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి.. ఇంట్లోని ఆధారాలు, వేలిముద్రల కోసం గాలిస్తున్నారు.

## సాయికృష్ణ కేసు.. లొంగిపోయిన హెడ్ కానిస్టేబుళ్లు




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** గాదె సాయికృష్ణ మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కృష్ణలంక పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న అశోక్, నాని సూర్యారావుపేట ఏసీపీ కార్యాలయానికి వచ్చి లొంగిపోయారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సీఐ నాగరాజుకు వీరిద్దరూ వెన్నంటి ఉండేవారు. సాయికృష్ణ మృతి వ్యవహారంలో అశోక్, నాని ఆయనకు సహకారం అందించినట్లు సిట్ గుర్తించింది. నాగరాజు అరెస్ట్ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన వారిద్దరూ నేడు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కృష్ణలంక స్టేషన్ పరిధిలోని బార్లు, మద్యం దుకాణాలు, లాడ్జీలు.. ఇతరత్రా కార్యకలాపాలకు సంబంధించిన వ్యవహారాలను అశోక్ చక్కదిద్దేవాడు. పలు సెటిల్మెంట్లకు పాల్పడేవాడని ఆరోపణలున్నాయి. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, పాత నేరస్థులతో సఖ్యంగా ఉండటం, బెదిరింపులకు పాల్పడటం, నేరస్థులను స్టేషన్‌కు తీసుకురావడం వంటి పనులను నాని చేసేవాడు. నాని పటమట స్టేషన్‌లో పనిచేసినప్పుడు స్పా సెంటర్ల విషయంలో ఆరోపణలు రావడంతో వీఆర్‌కు పంపించారు. గన్నవరం స్టేషన్‌లో పనిచేసినప్పుడు ఓ మిస్సింగ్ కేసులో ఆత్కూరు స్టేషన్ ఎస్సైని అని చెప్పి డబ్బులు వసూలు చేసిన వ్యవహారంలో సస్పెండయ్యాడు. సీఐ నాగరాజుకు సన్నిహితంగా మెలిగిన ప్రైవేటు వ్యక్తి సురేష్ కూడా వీరితో కలిసి రౌడీషీటర్ల కౌన్సెలింగ్, నిందితుల విచారణ, తదితర వ్యవహారాల్లో జోక్యం చేసుకునే వాడని తేలింది. గత నెల 29న సాయికృష్ణ బంధువులను కలిసేందుకు ఈ ముగ్గురూ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వెళ్లారని సిట్ అధికారులు గుర్తించారు. సురేష్‌ను సిట్ ఇప్పటికే అదుపులోకి తీసుకుంది.

## బైక్‌కు తాళ్లతో కట్టి.. చెరువులో మామ, అల్లుడి మృతదేహాలు



**కృత్తివెన్ను, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలో విషాదం చోటుచేసుకుంది. చిన్నగొల్లపాలెం గ్రామంలోని చెరువులో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. బైక్‌కు తాళ్లతో కట్టిన మృతదేహాలను సోమవారం మధ్యాహ్నం స్థానికులు గుర్తించారు. మృతులను శనివారం అదృశ్యమైన మామ శెట్టి సుబ్బన్న, అల్లుడు గొలుసు అయ్యప్పగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు గ్రామస్థుల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతదేహాలను తాళ్లతో బైక్‌కు కట్టి ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆర్టీసీ బస్సు బోల్తా..

### ఆర్టీసీ ఈఈ మృతి, 14 మందికి గాయాలు



**పెబ్బేరు పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ :** వనపర్తి జిల్లా పెబ్బేరు వద్ద ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. 14 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పెబ్బేరు, కర్నూలు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బస్సు మంత్రాలయం నుంచి వనపర్తి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనతో ఆ మార్గంలో కాసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. మృతిచెందిన వ్యక్తిని మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌లో ఈఈగా పనిచేస్తున్న శివప్రసాద్‌గా గుర్తించారు. కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన చనిపోయారు.

## బెంగళూరులో అంతర్రాష్ట్ర డ్రగ్స్ సరఫరాదారు అరెస్ట్

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** బెంగళూరులో తెలంగాణ ఈగల్ ఫోర్స్-ఎన్‌సీబీ జాయింట్ ఆపరేషన్ చేపట్టాయి. అంతర్రాష్ట్ర డ్రగ్స్ సరఫరాదారు రాహుల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద 241 గ్రాముల ఎండీఎంఏ, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నైజీరియా నుంచి డ్రగ్స్ తెప్పించి ఏజెంట్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. గచ్చిబౌలి, షాద్‌నగర్ డ్రగ్స్ కేసుల్లోనూ రాహుల్ నిందితుడిగా ఉన్నాడు. మరోవైపు తెలంగాణలో 10 మంది డ్రగ్ పెడ్లర్లు, కొనుగోలుదారులను ఈగల్ గుర్తించింది.

తల్లిని చంపి..

## ఆపై ఉరివేసుకుని కుమారుడి ఆత్మహత్య

**భూదాన్ పోచంపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా బండరాయితో తల్లిని కుమారుడు కొట్టి చంపాడు. ఆపై తానూ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భూదాన్ పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి ఈ ఘటన జరిగింది. మృతులను పోశమ్మ, శ్రీనివాస్‌గా గుర్తించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## దుబ్బాకలో భారీ చోరీ..

### కేజీ బంగారాన్ని ఎత్తుకెళ్లిన దొంగలు



**దుబ్బాక, విశ్వం వాయిస్ న్యూస్ :** దుబ్బాక పట్టణంలో భారీ చోరీ ఘటన చోటుచేసుకుంది. 15వ వార్డులోని ఓ ఇంట్లోకి దొంగలు చొరబడి నగదు, బంగారాన్ని ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన చింత రాజ్‌కుమార్ అనే మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడు తన కుటుంబ సభ్యులతో కలిసి కాశీ యాత్రకు 9 రోజుల క్రితం వెళ్లాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఇంటి కిటికీ ఊచలను విరగ్గొట్టి దొంగలు లోనికి ప్రవేశించారు. పడకగదిలోని లాకర్‌ను పగలగొట్టి.. అందులో ఉన్న బంగారం, నగదును ఎత్తుకెళ్లారు. బంగారం సుమారు కేజీ వరకు ఉన్నట్లు సమాచారం. సోమవారం ఉదయం ఇంటి ఆవరణను పరిశుభ్రం చేసేందుకు వచ్చిన పనిమనిషి మంజుల ఇంటి తాళాలు పగలగొట్టడం చూసి.. యజమానికి సమాచారం అందించింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తన సిబ్బందితో అక్కడికి చేరుకొని క్లూస్ టీమ్‌తో ధర్యాప్తు చేపట్టారు. భారీ చోరీ జరగడంతో సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు.

# బిజినెస్ వాయిస్

## తులం బంగారం రూ.3 లక్షలకు చేరుతుందా..?

ఈ సంవత్సరం నాటికి భారతదేశంలో తులం బంగారం రూ.3 లక్షలకు చేరుతుందా? భౌగోళిక ఉద్రిక్తతలు, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు, ద్రవ్యోల్బణం, డాలర్-రూపాయి మారకం వంటి అంశాలు బంగారం ధరలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో పూర్తి వివరాలు తెలుసుకోండి. అలాగే.. భారతదేశంలో బంగారం కేవలం ఒక ఆభరణం కాదు, అది ఒక భావోద్వేగం. బంగారం అంటే ప్రేమ. బంగారం ఒక బంధం. బంగారం ఒక సురక్షితమైన పెట్టుబడి, సంప్రదాయానికి చిహ్నం. గత కొన్నేళ్లుగా బంగారం ధరలు రాకెట్ వేగంతో పెరిగిపోతున్నప్పటికీ ప్రస్తుతం మాత్రం భారీగానే దిగి వస్తోంది. అయితే బంగారం ధరలపై నిపుణులు షాకింగ్ విషయాలను వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ నిపుణుల అంచనాలు పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించాయి. 2030 నాటికి భారతదేశంలో 10 గ్రాముల బంగారం ధర 3 లక్షల రూపాయలకు, అంటే గ్రాము ధర 30,000 రూపాయలకు చేరుకుంటుందా అనే ప్రశ్న సామాన్యులను ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత మార్కెట్ ధరను బట్టి చూస్తే 2030 నాటికి బంగారం ధర గ్రాముకు 30,000 వరకు చేరుకుంటుందని ఆశించడం అవాస్తవంగా అనిపించవచ్చు. కానీ మార్కెట్ విశ్లేషకులు, ఆర్థిక నిపుణుల ప్రకారం.. మారుతున్న ప్రపంచ రాజకీయ సమీకరణాలు, ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఈ అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేము. ఈ ధరల పెరుగుదలకు కొన్ని ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నారు విశ్లేషకులు. వారు చెబుతున్న వివరాల ప్రకారం..

1. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులు, మధ్యప్రాచ్య సంక్షోభం, వివిధ దేశాల మధ్య పెరుగుతున్న దౌత్యపరమైన ఉద్రిక్తతలు పెట్టుబడిదారులను సురక్షిత పెట్టుబడి మార్గం కోసం వెతికేలా చేస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి నెలకొన్నప్పుడల్లా, ప్రజలు స్టాక్ మార్కెట్ లేదా ఇతర ప్రమాదకర రంగాల నుండి తమ డబ్బును ఉపసంహరించుకుని బంగారంలో పెట్టుబడి పెట్టడం ప్రారంభిస్తారు. దీనినే 'సురక్షిత పెట్టుబడి' (సేఫ్ హెవెన్ ఇన్వెస్ట్‌మెంట్) అంటారు.

### ధరల పెరుగుదల వెనుక అసలు కారణాలు ఇవే..!



ఈ డిమాండ్ ఇలాగే కొనసాగితే బంగారం ధర ఆకాశాన్నంటడం ఖాయం.

2. కేంద్ర బ్యాంకుల బంగారం కొనుగోళ్లు

ప్రపంచంలోని ప్రధాన కేంద్ర బ్యాంకులు (భారతదేశపు ఆర్‌బిఐ, చైనా పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా వంటివి) అమెరికా డాలర్‌పై తమ ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి, తమ విదేశీ మారక నిల్వలలో బంగారం మొత్తాన్ని దూకుడుగా పెంచుతున్నాయి. కేంద్ర బ్యాంకుల ఈ భారీ బంగారు కొనుగోళ్ల ఉధృతి అంతర్జాతీయ మార్కెట్లో బంగారం సరఫరాను తగ్గిస్తోంది. ఇది దాని ధరను నేరుగా ప్రభావితం చేస్తోంది.

3. ద్రవ్యోల్బణం, డాలర్ బలహీనత

ప్రపంచవ్యాప్తంగా ద్రవ్య విలువ ఎంతగా పడిపోయినా లేదా ద్రవ్యోల్బణం పెరిగినా, బంగారం ధర అంతగా పెరుగుతుంది. ఎందుకంటే బంగారం ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా అతిపెద్ద రక్షణ కవచంగా పనిచేస్తుంది. అంతేకాకుండా అంతర్జాతీయ మార్కెట్లో యూఎస్ డాలర్ సూచీ బలహీనపడినప్పుడు బంగారం ధర సాధారణంగా పెరుగుతుంది.

**భారత మార్కెట్లో కరెన్సీ రేట్ల ప్రభావం**

భారతదేశంలో బంగారం ధరలను ప్రభావితం చేసే మరో ప్రధాన అంశం అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ. భారతదేశం తన బంగారం అవసరాలలో అధిక భాగాన్ని విదేశాల నుండి దిగుమతి చేసుకుంటుంది. అందుకే డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోతే భారతదేశంలోకి బంగారం దిగుమతి చేసుకునే ఖర్చు గణనీయంగా పెరుగుతుంది. 2030 నాటికి అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర పెరిగి డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత క్షీణిస్తే భారతదేశంలోని దేశీయ మార్కెట్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ. 3 లక్షల రికార్డు స్థాయికి చేరడం అసాధ్యం కాదు.

**మధ్యతరగతి, పెట్టుబడిదారులపై ప్రభావం:**

ఈ అంచనా నిజమైతే పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం కొనడం సగటు మధ్యతరగతి వారికి అందుబాటులో ఉండదు. అయితే దీర్ఘకాలిక పెట్టుబడుల గురించి ఆలోచిస్తున్న వారికి ఇది ఒక గొప్ప అవకాశం కావచ్చు. ఈ సమయంలో భౌతిక బంగారం (నగలు) కొనడం కంటే డిజిటల్ బంగారం, గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా ప్రభుత్వ సావరిన్ గోల్డ్ బాండ్లలో (ఎస్‌జీబీలు) పెట్టుబడి పెట్టడం చాలా లాభదాయకం. అలాగే సురక్షితం అని నిపుణులు భావిస్తున్నారు. 2030 లక్ష్యం ఇంకా చాలా దూరంలో ఉన్నప్పటికీ, ప్రస్తుత మార్కెట్ ధోరణులు రాబోయే రోజుల్లో బంగారం సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోవచ్చని సూచిస్తున్నాయి. అయితే కమోడిటీ లేదా బంగారు మార్కెట్ అత్యంత అస్థిరమైనదని గుర్తుంచుకోవాలి. అందువల్ల ఎలాంటి పెద్ద పెట్టుబడులు పెట్టే ముందు మార్కెట్ నిపుణుల సలహా తీసుకోవడం చాలా ముఖ్యం.

# డ్వాక్రా సంఘాల్లో సంస్కరణలు చేపట్టాలి

## స్వతంత్ర సామాజిక ఆడిట్ నిర్వహించాలి : బీజేపీ జనతా వారధి బృందం
## కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్‌లో వినతిపత్రం సమర్పణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో డ్వాక్రా (ఎస్‌హెచ్‌జీ) సంఘాల పనితీరు, మహిళా సాధికారత, సెర్ప్-మెప్మా వ్యవస్థల పారదర్శకతపై సమగ్ర సమీక్ష నిర్వహించి అవసరమైన సంస్కరణలు చేపట్టాలని బీజేపీ జనతా వారధి బృందం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్‌లో అధికారులకు వినతిపత్రం అందజేసింది. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం ఏర్పాటైన డ్వాక్రా సంఘాలు లక్షలాది మహిళలకు ఆర్థిక చైతన్యం కల్పించాయని, గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్, పట్టణ ప్రాంతాల్లో మెప్మా ఆధ్వర్యంలో ఈ వ్యవస్థ కొనసాగుతోందని బృందం పేర్కొంది. అయితే క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పుడు పలు ఆందోళనకర అంశాలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపింది. జనతా వారధి కార్యక్రమంలో భాగంగా మహిళలు, డ్వాక్రా సంఘాలతో నిర్వహించిన సమావేశాల్లో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వెల్లడించింది. సంఘాల అసలు బలం అయిన పొదుపు తగ్గిపోతుండగా, రుణాల పంపిణీ వ్యవస్థగానే మారిపోతున్నాయని పేర్కొంది. స్వయం ఉపాధి, ఆదాయ వృద్ధికి ఉపయోగపడాల్సిన రుణాలు వైద్య చికిత్సలు, విద్య, వివాహాలు, పాత అప్పుల చెల్లింపులకు వినియోగించడంతో మహిళలు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. కొన్ని ప్రాంతాల్లో రుణాల మంజూరులో ఆలస్యం, అనవసర పత్రాల డిమాండ్, బలవంతపు బీమాలు, అదనపు డిపాజిట్లు, అలాగే ఆర్‌పీల ద్వారా శాతం వసూళ్లపై ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా సంఘాలపై స్వతంత్ర సామాజిక ఆడిట్ నిర్వహించాలని, ప్రతి సంఘానికి డిజిటల్ అకౌంటింగ్, పారదర్శక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. రుణాల మంజూరు సమయంలో అన్ని డిడక్షన్లు, బీమా, ఇతర ఛార్జీల వివరాలను లిఖితపూర్వకంగా ఇవ్వడం తప్పనిసరి చేయాలని కోరింది. అలాగే బలవంతపు బీమాలు, అనధికార కమిషన్లు, శాతం వసూళ్లపై విచారణ జరిపి, పొదుపు ఆధారిత వ్యవస్థను మళ్లీ బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేసింది. కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నప్పటికీ, డ్వాక్రా వ్యవస్థను కేవలం రుణాల పంపిణీ వ్యవస్థగా మార్చడం సరైంది కాదని పేర్కొంది. సెర్ప్, మెప్మా సంస్థలు పారదర్శక పర్యవేక్షణ, ఆడిట్‌తో నిజమైన మహిళా సాధికారత దిశగా పనిచేయాలని కోరింది. ఈ కార్యక్రమంలో జనతా వారధి కన్వీనర్ కృష్ణంరాజు, కో-కన్వీనర్ యానాపు ఏసు, బండి ప్రసాద్, సూర్యకిరణ్, మీనాక్షి, జగనన్న కాలనీ నిర్వాసితులు కానూరి జ్యోతి, నెల్లిపూడి లక్ష్మి, అమ్ములు, దార్ల బద్రావతి తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రపురం ఆర్‌డిఓతో ఏపీఎన్జీజీఓ ప్రతినిధుల భేటీ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం రెవిన్యూ డివిజనల్ అధికారి పి.సరళవతిని ఏపీఎన్జీజీఓ అసోసియేషన్ రామచంద్రపురం తాలూకా యూనిట్ అధ్యక్షులు పెట్టా సత్యనారాయణ నాయకత్వంలో ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీఎన్జీజీఓ అసోసియేషన్ అధ్యక్షులు మాధవరపు వెంకటేశ్వర్లు ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చిక్కాల సూర్యారావు, తాలూకా కార్యదర్శి నయనాల శ్రీనివాసరావు, కోశాధికారి మాధవరపు కాశీ విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఇమ్మమ్ షరీఫ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏ.వి.వి. సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి అడపా వెంకట్రావు, అశోక్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పడాల సత్యప్రసాద్‌తో పాటు ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ద్రాక్షారామం అగ్నిబాధితులకు అండగా నిలిచిన రైస్ మిల్లర్స్

## రూ.7 లక్షల విరాళం అందజేత



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామం మార్కెట్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ముందుకొచ్చింది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేసిన విజ్ఞప్తికి స్పందించిన మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు మొత్తం రూ.7 లక్షల విరాళాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు అందజేశారు. ఇప్పటికే అగ్నిప్రమాద బాధితులకు సొంతంగా రూ.20 లక్షల వ్యక్తిగత సహాయాన్ని ప్రకటించిన మంత్రి వాసంశెట్టి సుభాష్, బాధితులకు అండగా నిలవాలని దాతలను కోరడంతో విశేష స్పందన లభిస్తోంది. మంత్రి పిలుపుతో ఇప్పటివరకు సుమారు రూ.70 లక్షల మేర సహాయం సమకూరింది. ఇందులో భాగంగా మండపేట రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.2 లక్షలు, రామచంద్రపురం నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.7 లక్షలను అందించారు. కష్టకాలంలో బాధితులకు అండగా నిలిచిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకుల సేవాభావాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ అభినందించారు. బాధిత కుటుంబాల పునరావాసానికి ప్రభుత్వం, దాతలు మరియు ప్రజల సహకారంతో అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు చుండ్రు వివిఎస్ఎస్ చౌదరి, సత్తిరెడ్డి, వేపకాయల పెదబాబు మరియు కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ఆర్టీఈ ఉచిత సీట్లు పొందిన

# పేద విద్యార్థుల నుంచి ఫీజుల దోపిడీని అరికట్టాలి

## పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా





**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పరిధిలోని ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని పీడీఎస్‌యూ ఆరోపించింది. విద్యా హక్కు చట్టం కింద ఉచిత ప్రవేశం పొందిన పేద విద్యార్థుల నుంచి కూడా వివిధ పేర్లతో డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొంటూ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ మాట్లాడుతూ విద్యాసంస్థలు ట్యూషన్ ఫీజులతో పాటు పుస్తకాల పేరుతో రూ.8,000, యూనిఫారాల పేరుతో రూ.2,000, ఆటల ఫీజు పేరుతో రూ.6,000, రవాణా పేరుతో రూ.10,000 మరియు ప్రత్యేక శిక్షణ వంటి పేర్లతో భారీ మొత్తాలు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విద్యాసంస్థల ప్రవేశాల నియంత్రణ మరియు కాపిటేషన్ ఫీజు నిషేధ చట్టం ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేయడం, విరాళాలు తీసుకోవడం నేరమని అయినప్పటికీ విద్యాశాఖ అధికారులు కళ్లు మూసుకుని వ్యవహరిస్తున్నారని పీడీఎస్‌యూ తీవ్రంగా విమర్శించింది. చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు విద్యాసంస్థలకు అండగా నిలుస్తూ పేద విద్యార్థుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించింది. విద్యా హక్కు చట్టం ప్రకారం ఆరు నుంచి పద్నాలుగు సంవత్సరాల పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత. ఈ చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఇరవై ఐదు శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించి ఎలాంటి ఫీజులు వసూలు చేయకూడదు. అయినప్పటికీ.పుస్తకాలు, యూనిఫారాలు, ఆటల ఫీజు, రవాణా తదితర పేర్లతో డబ్బులు వసూలు చేస్తూ చట్టాన్ని బహిరంగంగా ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. ఫీజులు చెల్లించిన వారికి మాత్రమే పుస్తకాలు, యూనిఫారాలు అందించడం, క్రీడల్లో పాల్గొనే అవకాశం కల్పించకపోవడం, ఫీజులు చెల్లించని విద్యార్థులను మధ్యాహ్నం రెండు గంటలకే ఇంటికి పంపించడం వంటి వివక్షను విద్యాసంస్థలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో ఫీజుల నియంత్రణను గాలికి వదిలేశారని పీడీఎస్‌యూ విమర్శించింది. విద్యాసంస్థల అక్రమాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, పేద విద్యార్థుల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం విద్యా మాఫియాల ప్రయోజనాలకే పనిచేస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొంది. చట్టం కింద ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల పాఠశాలలు ఆ భారాన్ని పేద తల్లిదండ్రులపై మోపుతున్నాయని దీనికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు కె.శివ, కె.రవి, వానపల్లి నాగరాజు, ఉదయ్, కె.సురేష్, పులిదిండి రాజు తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల

### హ్యాచ్ ఇండియా కంపెండియం



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడలో నిర్వహించిన హ్యాచ్ ఇండియా కంపెండియం పుస్తకావిష్కరణ, ఆక్వా పరిశ్రమ పరస్పర చర్చా కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ ఆక్వా రంగం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమైందని, రొయ్యల హ్యాచరీలు మరియు ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అలాగే పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహకాలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఆక్వా రంగ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెరాబత్తుల రాజశేఖర్, పలువురు శాసనసభ్యులు, ఆక్వా పరిశ్రమ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

### మాల, మాదిగపేటకు రోడ్లు, స్మశానవాటికను

# అభివృద్ధి చేయాలి : బీఎస్పీ డిమాండ్




**ఉప్పలగుప్త, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్త మండలం పెద్దూరు గ్రామంలోని మాల, మాదిగ పేటకు తక్షణమే రోడ్లు నిర్మించి, స్మశానవాటికను అభివృద్ధి చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఎస్పీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్ బాబు గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గత సుమారు 30 సంవత్సరాలుగా మాల, మాదిగపేటలో రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో పాటు స్మశానవాటిక అభివృద్ధిని కూడా నిర్లక్ష్యం చేశారని ఆయన ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా దళితవాడ అభివృద్ధికి తీవ్ర ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ పెద్దూరు మాల, మాదిగపేట అభివృద్ధి మాత్రం జరగలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రహదారులు నిర్మించి, స్మశానవాటికను అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చాట్ల విద్యాసాగర్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు భూషి జాన్ మోషే వాకపల్లి హరీష్ కుమార్, సాఖ రాజారావు, కముజు నాగేశ్వరరావు, కొమనపల్లి మహేష్, పెదపూడి సుబ్బారావు, చాట్ల రామకృష్ణ, నవ్వేంద్రు సత్యనారాయణ, కొంకి మునీంద్ర, కొమనపల్లి చంద్రరావు, నందికి కృష్ణమూర్తి, గుండె వెంకటరమణ, చికురమిల్లి సత్యనారాయణ, మోకాటి గాంధీ, సత్తాల రాజు, తొత్తరమూడి దుర్గారావు, మోకాటి పుష్పావతి, కొమనపల్లి సత్యవతి, మోకాటి మంగ, కొంకి విజయకుమార్, పొద్దుకు నరేంద్ర,నందిక, బుజ్జి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు పై వర్షం నీరుని

# తొలగించండి




**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, కాట్రేనికోన మండలం, కంచువారిపేట సమీపంలో మాజీ ఎంపిపి వానమూర్తి ఇంటి సమీపంలో సిసి రోడ్డుపై వర్షపునీరు నిలబడతాంతో స్కూల్ విద్యార్థులు, ప్రయాణికులు ఇబంధులు పడుతున్నారు. దీనిపై తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి, తగు చర్యలు. చేపడతారని ప్రజలు కోరుకుంటుంది. దీనిపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.



# అర్జీల పరిష్కారంలో నాణ్యతకు పెద్దపీట వేయాలి

## జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్జీల పరిష్కారంలో నాణ్యతకు పెద్దపీట వేస్తూ, జవాబుదారీతనంతో నూటికి నూరు శాతం అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ జిల్లాస్థాయి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో మర్యాదపూర్వక వాతావరణంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సుమారు 220 అర్జీలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి, డీఆర్వో వి.సుబ్బారావు, ఎస్‌డీసీ అచ్చుత కుమారి అర్జీదారుల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజల సంతృప్తే అధికారుల పనితీరుకు అసలైన గీటురాయని, సేవల నాణ్యతే సుపరిపాలనకు సరైన ప్రమాణమని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని, నిర్లక్ష్యం లేదా బాధ్యతారాహిత్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, ప్రజా స్నేహపూర్వకంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఫిర్యాదు పరిష్కారం అనంతరం జిల్లాస్థాయి అధికారులు స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్య పరిష్కారంపై వారి అభిప్రాయా లను తెలుసుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కార నాణ్యతపై పూర్తి బాధ్యత సంబంధిత అధికారులదేనని స్పష్టం చేశారు. ఒకసారి సమర్పించిన అర్జీలు మళ్లీ పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి మాట్లాడుతూ, పీజీఆర్‌ఎస్‌తో పాటు ప్రజల నుంచి వచ్చే అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని అన్నారు. ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలని, సిబ్బందిని వినూత్నంగా ఆలోచించేలా ప్రోత్సహించాలని సూచించారు. అర్జీదారుల స్థానంలో తమను తాము ఉంచుకొని సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరిస్తే పాలనపై ప్రజల్లో మంచి భావన ఏర్పడుతుందని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగులు తమ పాలనా సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని, క్షేత్రస్థాయిలో పర్యటించడం ద్వారా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రతి అధికారి జవాబుదారీతనం, నిబద్ధతతో పనిచేయాలని, ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా సేవలు అందించడం ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి అర్జీని నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పేకాట శిబిరంపై పోలీసుల దాడి



**ఉప్పలగుప్తం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉప్పలగుప్తం మండలం నంగవరంలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.7,190 స్వాధీనం చేసుకున్నామని ఉప్పలగుప్తం ఎస్ఐ రాఖ జానీ భాష తెలిపారు. ఎవరైనా పేకాట, కోడి పందేలు వంటి చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పోలీసు కేసుల్లో ఇరుక్కుని జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు.

# ఈ పంట కాలువకు మోక్షం ఎప్పుడు?



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాగం, అయినాపురం పంట కాలువ గుర్రపుడెక్క, చెత్తాచెదారంతో పూర్తిగా మూసుకుపోయింది. సాగునీటి కోసం ఎద్దడి సమయంలో ఇంజిన్లను ఆశ్రయిస్తున్నామని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. వర్షాకాలం వచ్చినా కాలువను పునరుద్ధరించకపోవడంతో చేలు ముంపునకు గురవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమేకాలువను శుభ్రం చేయించాలని రైతులు కోరుతున్నారు.

# రెవెన్యూ అధికారుల జాడేది...?



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గేదెల్లంక గ్రామంలో సర్వే నెంబర్ 150,151 లలో అక్రమంగా రొయ్యల చెరువులు తవ్వుతున్నారని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో ఒకసారి భూమిలో చెరువులు తవ్వకానికి ప్రయత్నం చేయగా అప్పుడు రైతులు అడ్డుకోవడంతో పనులు నిలిపివేశారు. ఇప్పుడు మరల చెరువుల తవ్వకాలు చేపట్టారని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తవ్వకాల కోసం సరిహద్దు లు కూడా తవ్వి వేస్తున్నారని దీనిపై ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. రెవెన్యూ అధికారులు చెరువుల తవ్వకాల నిలుపుదల చేయాలని వారు కోరుతున్నారు.

# బాధితుల సమస్యలకు సత్వర న్యాయమే మా ప్రాధాన్యత : జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తేతో కలిసి బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడి, వారి సమస్యలను ఓపికగా విని ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 34 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, సివిల్ సంబంధిత సమస్యలు ఉన్నాయి. అందిన ఫిర్యాదులను తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరపాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. చట్టపరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా, జాప్యం లేకుండా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తే, డీపీఓ సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఏరువాక సాగాలి.. రైతుల పంట పండాలి : వీరంశెట్టి సతీష్

### ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతు పూజోత్సవం
### కోనసీమ ఆహారనిధి ఆధ్వర్యంలో ఎనిమిదో ఏదాది వేడుకలు





**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** "రైతు బాగుంటే ప్రతి రోజూ పౌర్ణమే" అని కోనసీమ ఆహారనిధి అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ అన్నారు. తెలుగింటి అన్నపూర్ణమ్మ డొక్కా సీతమ్మ స్ఫూర్తితో కోనసీమ ఆహారనిధి ఆధ్వర్యంలో గత ఎనిమిదేళ్లుగా నిర్వహిస్తున్న ఏరువాక పౌర్ణమి రైతు పూజోత్సవం ఈ ఏడాది అంబాజీపేట మండలం ఇరుసుమండ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరంశెట్టి సతీష్ మాట్లాడుతూ తొలకరి వర్షాలు ప్రారంభమైన అనంతరం వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టి నాగలితో పొలాలను దున్నే సంప్రదాయాన్నే ఏరువాక పౌర్ణమిగా జరుపుకుంటారని తెలిపారు. రైతు సంతోషంగా ఉంటేనే సమాజం సుభిక్షంగా ఉంటుందని, పంటలు సమృద్ధిగా పండించి అందరి ఆకలి తీర్చేది రైతేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు వీరంశెట్టి రామకృష్ణ పరమహంస, గుత్తుల విశ్వేశ్వరరావు, యార్లగడ్డ వెంకట్రావు, మామిడిశెట్టి రాంబాబు, మహేశ్వరరావుతో పాటు కోనసీమ ఆహారనిధి సభ్యులు వీరు గట్టెం, బందారు సురేష్, కిరణ్ చీకట్ల, పోలిశెట్టి పవన్ మహేష్, అయ్యప్ప వెదుల్లపల్లి, రంకిరెడ్డి శ్రీనివాస్, రోళ్ళ హనుమంతరావు పాల్గొన్నారు.

# ద్రాక్షారామం మార్కెట్ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

### అగ్నిప్రమాద బాధిత వ్యాపారులకు కొండంత అండగా నిలిచిన మంత్రి వాసంశెట్టి సుభాష్
### ఇచ్చిన మాట ప్రకారం వేగంగా షెడ్ల నిర్మాణానికి శ్రీకారం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం,ద్రాక్షారామం మార్కెట్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన 48 షాపుల పునర్నిర్మాణానికి సోమవారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇచ్చిన హామీ మేరకు, ఆయన చొరవతో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి మార్కెట్ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఆర్డీవో సరళావతి, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వర్తక సంఘం అధ్యక్షులు అల్లం సుబ్బారావు చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించారు. వర్తక సంఘం సభ్యులు, వ్యాపారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కొద్ది రోజుల క్రితం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్నిప్రమాదంలో 48 దుకాణాలు పూర్తిగా దగ్ధమై, వాటిపై ఆధారపడి జీవిస్తున్న అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న వెంటనే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్య లో పాల్గొని బాధితులను పరామర్శించారు. ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని, మార్కెట్‌ను తిరిగి నిర్మించి వ్యాపారులకు అందజేస్తామని హామీ ఇచ్చిన విషయం విధితమే. మంత్రి సుభాష్ ఆదేశాల మేరకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, కూటమి పార్టీ నాయకులు, దాతల సహకారంతో నిధులు సమీకరించి మార్కెట్ పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ కొద్ది రోజుల్లోనే పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం పట్ల బాధిత వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిక్కాల దొరబాబు, మాగాపు అమ్మిరాజు, రేవు శ్రీను, చిక్కాల సుబ్రహ్మణ్యం, కూటమి పార్టీ నాయకులు, అధికారులు, సహకరించిన దాతలు, వర్తక సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యతగా భావించి ద్రాక్షారామం మార్కెట్‌ను త్వరితగతిన నిర్మించి బాధిత వ్యాపారులకు అందజేస్తాం అనే మంత్రి వాసంశెట్టి సుభాష్ సంకల్పానికి అనుగుణంగా పునర్నిర్మాణ పనులు ప్రారంభం కావడం పట్ల వర్తక వ్యాపారులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

# అమలాపురంలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో భారీ జరిమానాలు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 14 మందికి స్థానిక స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు భారీ జరిమానాలు విధించింది. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని సోమవారం మేజిస్ట్రేట్ చామకూరి నాగేశ్వరావు ఎదుట పోలీసులు హాజరుపరచగా, నేర తీవ్రతను పరిగణనలోకి తీసుకుని మొత్తం రూ.1.45 లక్షల అపరాధ రుసుము విధించారు. వివరాల్లోకి వెళితే, ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.11 వేల చొప్పున మొత్తం రూ.55 వేల జరిమానా, మరో తొమ్మిది మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.90 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు మాట్లాడుతూ, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించే ఇటువంటి చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

# ఆక్వా చెరువుల వద్ద వ్యక్తి మృతి



**ఉప్పలగుప్తం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉప్పలగుప్తం మండలం కిత్తనచెరువు, పాతాళదిబ్బ గ్రామ పరిధిలోని ఆక్వా చెరువుల వద్ద పరమట భీమారావు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతుడు ఐ.పోలవరం మండలం కేశనకుర్రు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. సమాచారం అందిన వెంటనే ఉప్పలగుప్తం ఎస్ఐ ఎస్‌కె జానీ బాషా ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

### కష్టకాలంలో ఉన్న కుటుంబానికి
# రూ.20 వేల ఆర్థిక సాయం
### అండగా నిలిచిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే ప్రజాప్రతినిధి బాధ్యత అనే నమ్మకంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. రామచంద్రపురం రూరల్ మండలం వెంకటాయపాలెంకు చెందిన ఐనాపురపు సుబ్బరాజు ఇటీవల మృతి చెందగా ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి సుభాష్ వారి కుటుంబాన్ని స్వయంగా పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మృతుడి కుమారుడు శ్రీ వెంకట దుర్గా సత్య సూర్యనారాయణకు రూ.20,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం తన బాధ్యత అని, ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చినా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి తోడుగా ఉంటానని మంత్రి సుభాష్ భరోసా ఇచ్చారు. మంత్రి చూపిన ఆప్యాయత, తక్షణ ఆర్థిక సహాయానికి మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి నాయకుడు తమకు అండగా ఉండటం ధైర్యాన్ని ఇచ్చిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కణితి రాంబాబు, గంధం ఉమా శంకర్ కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### టిడిపి కార్యకర్త మోకా లోవరాజు మృతికి
# వర్తక సంఘం సంతాపం



**కాట్రేనికోన, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇటీవల గెద్దనపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో టిడిపి కార్యకర్తకు మోకా లోవరాజు మరణించిన సంగతి తెలిసిందే. కాట్రేనికోన గేట్ సెంటర్ వర్తక సంఘం సోమవారం లోవరాజు మృతికి సంతాపం ప్రకటించారు. దుకాణాలు మూసివేశారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి నాగ హనుమంతరావు, గువ్వల సత్తిబాబు, వాసంశెట్టి రాజేశ్వరరావు, గువ్వాల శ్రీనివాస్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ద్రాక్షారామం భీమేశ్వర స్వామి ఆలయంలో
# వైభవంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామం శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సుభిక్షంగా ఉండి సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో రామ జపం, భూసూక్త, నీలా సూక్త, వరుణ సూక్త పారాయణలు నిర్వహించారు. అనంతరం వరి నాట్లకు అవసరమైన విత్తనాలను పూజించి, ఆచరణాత్మక పద్ధతిలో గంగతో పవిత్రకరించారు. వ్యవసాయ రంగంలో రైతుల పాత్రను గౌరవిస్తూ మహిళా రైతులు మరియు రైతులకు పసుపు, కుంకుమలతో సౌభాగ్య సత్కారం చేసి, పూజించిన వరి విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

# అమలాపురంలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో భారీ జరిమానాలు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 14 మందికి స్థానిక స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు భారీ జరిమానాలు విధించింది. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నిందితులను సోమవారం మేజిస్ట్రేట్ చామకూరి నాగేశ్వరరావు ఎదుట పోలీసులు హాజరుపరచగా, ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.11 వేల చొప్పున మొత్తం రూ.55 వేల అపరాధ రుసుము విధించారు. మరో తొమ్మిది మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.90 వేల జరిమానా విధించారు. దీంతో మొత్తం 14 మందిపై రూ.1.45 లక్షల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అమలాపురం పట్టణ సీఐ వీరబాబు మాట్లాడుతూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. డ్రంకెన్ డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

### ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్

# 46 వసంతాలు పూర్తి

## ఆదరించిన కస్టమర్లకు ధన్యవాదములు తెలిపిన బ్యాంక్ టీం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ వారు ప్రెస్ మీట్ ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బ్యాంక్ 1980 సంవత్సరంలో ప్రారంభించబడిదని ఇప్పటికి 18 బ్రాంచిలతో 46 సంవత్సరములు విజయవంతంగా పూర్తి చేసుకుని 47 సం॥ము వార్షిక నివేదిక ప్రకారము ది.31.03.2026 సంవత్సరమునకు ఆడిట్ కాబడిన బ్యాంక్ యొక్క ఆర్థిక వివరాల తెలియజేశారు. మన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 46 సహకర కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులు ఉండగా ది కాకినాడ కో- ఆపరేటివ్ టౌన్ బ్యాంకు రూ.2040 కోట్లు టర్నోవర్తో రెండవ స్థానంలో ఉంది. వీటిలో 100 సం॥లు పూర్తి చేసుకున్న బ్యాంకులు ఉండగా, 47 సం॥లకే ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు అస్థానం పొందింది.రికార్డు స్థాయిలో బ్యాంక్ టర్నోవర్ ది.31.03.2026వ తేదీకి మొత్తం బిజినెస్ టార్కెట్ రూ. 2000 కోట్లు కాగా, ఇది అధిగమించి రూ.2040 కోట్లకు చేరింది. అంతేగాక రిజర్వుబ్యాంకు వారి దృష్టిలో టైర్-3, బ్యాంకుగా సుస్థిర స్థానం పొందింది.బ్యాంక్ డిపాజిట్లు ది.31.03.2026 తేది నాటికి రూ.1235.56 కోట్లు, లోన్లు రూ.804.12 కోట్లు, ఇన్వెస్టెంట్లు 552.14 కోట్లు ఉన్నవి. (గవర్నమెంటు సెక్యూరిటీలలో రూ.401.05 కోట్లు, ఇతర బ్యాంక్లలో రూ.151.09 కోట్లు కలవు. బ్యాంక్ లో 31.03.2026 తేది నాటికి 55,605 మంది సభ్యులు రూ.28.63 కోట్లు వాటా ధనము (రాష్ట్రుతీవ ఝుజూత్ఝుశ్రీ) కల్గి ఉన్నారు. బ్యాంకు స్వంత నిధులు 31.03.2026 తేది నాటికి రూ.198.20 కోట్లు కల్గి ఉన్నవి.31.03.2026 తేది నాటికి నికర లాభము ఇన్కంటాక్స్ ప్రొవిజన్ రూ.5.61 కోట్లు చెల్లించిన తర్వాత రూ.16.18 కోట్లు ఆర్జించడమైనది. బ్యాంకు గత సంవత్సరం చీవ్ చీూా 0.00% గా ఉండగా ఈ సంవత్సరం 31-03-2026 నాటికి చీవ్ చీూా 0.00% గా ఉంది. ఇది రిజర్వు బ్యాంకు నిబంధన ప్రకారం 3% దాట కూడదు.జ=ూ= గత సంవత్సరములో 18.24% ఉండగా ఈ సంవత్సరంలో 18.23% కి చేరినది. ఇది రిజర్వు బ్యాంకు వారి నిబంధన ప్రకారం 9% పైన ఉండాలి. 12% పైన ఉన్నట్లుయితే చాలా స్ట్రాంగు బ్యాంకు క్రింద పరిగణిస్తారు. సభ్యులకు ఈ సంవత్సరం 12% డివిడెండ్ ఇచ్చుటకు పాలక వర్గం ఆమోదించారు. బ్యాంకు ఈ సంవత్సరం కూడా 'ూ' గ్రేడే సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. రిజర్వు బ్యాంకు వారు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులను డిపాజిట్లు ఆధారంగా టైర్ - I,II, III, IV బ్యాంకులుగా విభజించడం జరిగినది. రూ.100 కోట్లులోపు టైర్-1, 100 కోట్లు నుండి రూ.1000 కోట్లు లోపు టైర్- II, రూ.1000 కోట్లు నుండి 10000 కోట్లు లోపు టైర్-III, రూ. 10000 కోట్లు పైబడిన బ్యాంకులను టైర్-IVగా వర్గీకరించబడిమైనది తెలిపారు.

### అంగన్వాడి కేంద్రాలను

# బలోపేతం చేయాలి




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేయాలని, ప్రీస్కూల్ పిల్లలను అంగన్వాడీ పాఠశాలలోనే వెయ్యాలని, ప్రీస్కూల్ అనుమతి లేని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో పిల్లలను చేర్పించవద్దని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కాకినాడ రూరల్ మండలం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ మండలం సిఐటియు మండల కార్యదర్శి తొట్టిపూడి రాజా, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి వీరమణి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రీస్కూల్ విద్య అంతా అంగన్వాడి కేంద్రాల ద్వారానే అందించాలని నూతన జాతీయ విద్యా విధానం ద్వారా చెబుతున్న మన రాష్ట్రంలో ఎక్కడా కూడా అమలు కావడం లేదన్నారు. మూడు నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలను గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు పంపించి ఒత్తిడి లేని విద్యను అందించాలని ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు నిబంధనలను ఉల్లంఘించి అడ్మిషన్ చేసుకుంటున్నారు అన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలకు ప్రీస్కూల్ అనుమతి లేకపోయినా పిల్లలను చేర్చుకుంటూ ఉంటే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో పోస్టాహారంతో పాటు ఆటలు పాటలు మాటలు నేర్పడంలో ఎంతో అనుభవం ఉన్న టీచర్లు ఉన్నారన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అంగన్వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ విద్యను అడ్మిషన్లు తీసుకోవాలని కింద అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సెక్టార్ నాయకులు వరలక్ష్మి, కనకమహాలక్ష్మి, రాజేశ్వరి, సురేఖ, అప్పలకొండ సిఐటియు నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రయాణికులకు సదుపాయం కల్పించిన

# చేయూత స్వచ్ఛంద సంస్థ

### కరప మాజీ సర్పంచ్ తాతీలు కోరిక మేరకు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప గ్రామానికి చెందిన ప్రస్తుతం కాజులూరు ఉన్నత పాఠశాల లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేయుచున్న చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి చింతా నారాయణ మూర్తి కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు సూచన మేరకు తన మాతృమూర్తి చింతా చంద్రావతి జ్ఞాపకార్ధం తన తండ్రి చింతా సత్యనారాయణతో కలిసి గ్రామంలో ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి ఎదురుగా గల బస్ స్టాప్ వద్ద బస్ కోసం నిరీక్షించే వారు కూర్చునేందుకు వీలుగాను మరియు పల్లపు వీధి రామాలయం వద్ద, సీతమ్మపోటు రామాలయం వద్ద పెద్దవారు కూర్చొని విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా దాదాపు 20 వేలు విలువగల 6 సిమెంట్ సోఫాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా తాతీలు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి యువత తోడ్పాటు అందిస్తే ఆ గ్రామం ఆదర్శ గ్రామంగా మారుతుందని అన్నారు. ఈ ఉపాధ్యాయుడు నారాయణ మూర్తి స్ఫూర్తి తో పలువురు గ్రామానికి చెందిన ఉద్యోగులు కూడా గ్రామానికి కావలసిన అవసరాలు తీర్చడానికి ముందుకు వస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాయుడు జగన్నాథం, వలసపాకల్ మాజీ సర్పంచ్ వాసంశెట్టి రామారావు, రెడ్డి వీరభద్రరావు, రిటైర్డ్ ఆర్టిసి ఉద్యోగి చోడపునీడి రాంబాబు, కాకి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# విశాఖలో భారీ ఈవెంట్‌కి కూటమి రెడీ !



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ మీద ప్రత్యేక ఫోకస్ పెడుతున్న సంగతి తెలిసిందే. విశాఖతో పాటు ఉత్తరాంధ్రా జిల్లాల అభివృద్ధి కోసం పరిశ్రమలను తీసుకుని రావడం అలాగే భోగాపురంలో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు, శ్రీకాకుళం మూలపేటలో పోర్టు నిర్మాణం అదే జిల్లాలో కార్గో ఎయిర్ పోర్టు ఇలా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో మిట్టల్ స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్, ఇతర పరిశ్రమలు కూడా వస్తున్నాయి. ఐటీ కంపెనీలకు విశాఖ కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది. అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ కూడా విశాఖ జిల్లాలో ఏర్పాటు అవుతోంది. ఈ క్రమంలో విశాఖలో మరో భారీ ఈవెంట్ కి కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది.

**నవంబర్‌లో సీఐఐ సదస్సు**

ఇదిలా ఉంటే నవంబర్ నెలలో విశాఖ వేదికగా భారీ ఎత్తున 31వ సీఐఐ సదస్సుని నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. నవంబర్ 12, 13 తేదీలలో రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో పెట్టుబడులను జాతీయంగా అంతర్జాతీయంగా కూడా ఆకట్టుకునేందుకు యాక్షన్ ప్లాన్ ని ప్రభుత్వం రూపొందిస్తోంది. గతంలో నిర్వహించిన సీఐఐ సదస్సు వల్ల పెట్టుబడులు అధికంగా ఏపీకి రావడం జరిగింది. అందులో చాలా వరకూ గ్రౌండింగ్ అయ్యాయి అని అధికారులు చెబుతున్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్న కొత్త విధానంతో వచ్చిన పెట్టుబడులు సకాలంలో సాకారం అయ్యేలా వాటి శంకుస్థాపనలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇపుడు మరోసారి సీఐఐ సదస్సు నిర్వహణ ద్వారా మరిన్ని పెట్టుబడులను ఏపీకి తీసుకుని రావాలని చూస్తోంది.

**సన్నాహక సదస్సులతో..**

ఇక విశాఖ వేదికగా నవంబర్ 12, 13 తేదీలలో సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించాలని తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులతో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు విశాఖలో జరిపే భాగస్వామ్య సదస్సు కంటే ముందుగా విశాఖ, రాజమండ్రి లేదా కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలో ప్రాంతీయ భాగస్వామ్య సమావేశాలు నిర్వహించాలని కూడా సూత్రప్రాయంగా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

**జూలై నుంచే రెడీ**

ఇక విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సులో ఎంఓయూలు మినిస్టీరియల్ సెషన్స్ ప్లీనరీ కంట్రీ సెషన్స్ బీ2బీ బీ2జీ వంటి వాటి మీద వాటి ద్వారా పెట్టుబడులు లభించేందుకు ఒక కసరత్తు జరుగుతోంది. ఇలా రెండు రోజుల భాగస్వామ్య సదస్సు నిర్వహణకు భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సుకు జాతీయ అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు కేంద్ర మంత్రులు, వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించనుంది. జూలై నుంచి సెప్టెంబర్ వరకు దేశవిదేశాలలో రోడ్ షోలు చేపట్టి విశఖ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ప్రచారం కల్పించాలని కూడా కూటమి ప్రభుత్వ పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, కోయం బత్తూర్, అహ్మదాబాద్, హైదరాబాద్‌లో ఈ రోడ్ షోలు నిర్వహించనున్నారు. వ్యాపారాలు, పెట్టుబడులు వంటి అంశాల మీదే కాకుండా వినూత్న ఆలోచనలను పంచుకునేలా విశాఖలో సదస్సు నిర్వహించాలని చంద్రబాబు పేర్కొంటున్నారు. అలాగే ప్రాంతీయ సదస్సులలో కూడా ఎంఓయూలు కుదుర్చుకునేలా చూడాలని మంత్రులను అధికార వర్గాలను ఆయన కోరారు.

### ఏపీ మీదుగా బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే...

# టోల్ ఫీజు రూ.195!

**బేతమంగళ-బైరెడ్డిపల్లె మధ్య 25 కిలోమీటర్ల మార్గం ప్రారంభం**
**పూర్తయితే 3 గంటల్లోనే బెంగళూరు నుంచి చెన్నైకి ప్రయాణం**
**2026 డిసెంబర్ నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యం**



**విశ్వం వాయిస్ న్యూస్ :** బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. ఆంధ్రప్రదేశ్‌లో తొలి దశలో భాగంగా బేతమంగళ నుంచి బైరెడ్డిపల్లె వరకు 25 కిలోమీటర్ల మేర కొత్త మార్గాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ రాకపోకలకు అందుబాటులోకి తెచ్చింది. జూన్ 25 నుంచి ఈ మార్గంలో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. దీంతో ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణ దూరం దాదాపు 100 కిలోమీటర్లకు చేరింది. ఇప్పటికే కర్ణాటకలోని హోస్కోటె నుంచి బేతమంగళ వరకు 71 కిలోమీటర్ల మార్గం వినియోగంలో ఉండగా, తాజా విస్తరణతో బైరెడ్డిపల్లె వరకు నిరంతరాయంగా ప్రయాణించే వీలు కలిగింది. ఎన్ హెచ్ఏఐ విడుదల చేసిన టోల్ నోటిఫికేషన్ ప్రకారం, హోస్కోటె నుంచి బైరెడ్డిపల్లె వరకు ప్రయాణించే కార్లు, జీపులు, వ్యాన్‌లకు ఒకవైపు ప్రయాణానికి టోల్ ఛార్జీగా రూ.195 నిర్ణయించారు. మొత్తం 262 కిలోమీటర్ల పొడవైన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పూర్తయితే బెంగళూరు-చెన్నై మధ్య ప్రయాణ సమయం ప్రస్తుతం ఉన్న ఆరు గంటల నుంచి కేవలం మూడు గంటలకు తగ్గనుంది. ఈ ప్రాజెక్టు కర్ణాటక (72 కి.మీ.), ఆంధ్రప్రదేశ్ (85 కి.మీ.), తమిళనాడు (106 కి.మీ.) రాష్ట్రాల గుండా వెళుంది. ఆంధ్రప్రదేశ్‌లో 85 కిలోమీటర్ల పనులను మూడు ప్యాకేజీలుగా విభజించగా, వాటిలో రెండు దాదాపు పూర్తయినట్టు ఎన్ హెచ్ఏఐ అధికారులు తెలిపారు. అటవీ అనుమతుల కారణంగా పెండింగ్‌లో ఉన్న పనులను కూడా వేగవంతం చేస్తున్నారు. కొత్తగా ప్రారంభమైన బైరెడ్డిపల్లె టోల్ ప్లాజా వద్ద అప్పుడే రోజుకు సగటున రూ.2.2 లక్షల ఆదాయం వస్తోంది. మొత్తం ప్రాజెక్టును 2026 డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# వైసీపీ స్ట్రాటజీ: పాదయాత్ర టైం కోసమే.. !



వచ్చే ఏడాది వైసీపీ అధినేత జగన్ పాదయాత్రకు రెడీ అవుతున్నారు. అయితే.. ఏ కార్యక్రమానికైనా.. పునాది అంటూ ఉండాలి. దానిపైనే నాయకులు చేసే రాజకీయాలు నిలబడడమా.. కూలడమా? అనేది తేలుతుంది. ప్రస్తుతం వైసీపీ అధినేత జగన్ భవిష్యత్తులో చేయాలని నిర్ణయించుకున్న పాదయాత్రకు సంబంధించిన మసాలాను ఇప్పటి నుంచే రెడీ చేస్తున్నట్టు ప్రస్తుత రాజకీయాలను చూస్తే అర్థం అవుతుంది. పాదయాత్ర వంటి కార్యక్రమాలు హిట్ కొట్టాలంటే.. తమకు అనుకూలంగా వాతావరణం మలుచుకోవాల్సిన అవసరం ఉంది. గతంలో టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేసే సమయానికి వైసీపీ ప్రభుత్వంపై యువతకు పెద్ద ఎత్తున ఆగ్రహం ఉంది. ఒక్కటంటే ఒక్క డీఎస్సీ కూడా వేయకపోవడం, ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేపట్టకపోవడం వంటివి యువతలో ఆగ్రహాన్ని పెంచాయి. ఇదే సమయంలో నిత్యావసర వస్తువుల ధరలతోపాటు ఇతర పన్నుల బాదుడు కూడా ప్రజలను ఇరకాటం లో పడేసింది. ఇక, దేశంలోనే తొలిసారిగా చెత్తపై పన్ను విధించిన వైసీపీపై ప్రజలు కన్నెర్ర చేశారు. ఇదే సరైన సమయం అనుకున్న లోకేష్.. తన పాదయాత్రను ప్రారంభించారు. అది ఆయనకు అన్ని రూపాల్లో నూ కలిసి వచ్చింది. అయితే.. ఇప్పుడు వైసీపీ అధినేత జగన్ చేయాలని తలపోస్తున్న పాదయాత్రకు భూమిక అంటూ కనిపించడం లేదు. వైసీపీ నాయకులు పైకి చెబుతున్నట్టుగా కూటమి సర్కారుపై ప్రజల్లో భారీ ఎత్తున వ్యతిరేకత కూడా ఏమీ లేదు. సాధారణంగా ఉండే 10-15 శాతం వ్యతిరేకత మాత్రమే ఉంది. దీంతో పాదయాత్ర చేపట్టినా.. సక్సెస్ కావడం కష్టమనే భావన వైసీపీ నాయకుల్లో కనిపిస్తోంది. అందుకే.. ఉద్యమాలు, మద్దతు అంటూ.. కొత్త రాగాలు తీస్తున్నారన్న చర్చ జోరుగా జరుగుతోంది. అంటే.. కల్పిత వ్యతిరేకతను అడ్డు పెట్టుకుని పాదయాత్రకు పునాదులు వేసుకుంటున్నారని విశ్లేషకులు చెబుతున్నారు.



రాష్ట్రంలో 'రెడ్ బుక్ రాజ్యాంగం' కాదు..

# అంబేద్కర్ రాజ్యాంగమే అమలవ్వాలి

## ప్రజా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని మాజీ ఎంపీ భరత్ రామ్ వెల్లడి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాదని, లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని, ప్రజా సమస్యలపై గొంతు ఎత్తుతున్న వైసిపి నాయకులను అక్రమ కేసులతో అరెస్టులు చేస్తున్నారని వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ భరత్ మండిపడ్డారు. స్థానిక రియల్ పురం వైసిపి పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బాధిత ప్రజలు, రాజధాని రైతుల సమస్యలపై పోరాడుతున్న పార్టీ స్టీరింగ్ కమిటీ నాయకులను పోలీసులతో అడ్డుకోవడం రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన జరగడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో చట్టాలు, న్యాయ సూత్రాలు రెడ్ బుక్కు మాటన పోలీసు రాజ్యం నడుస్తోందని, విజయవాడలో పోలీస్ స్టేషన్లో సాయికృష్ణ అనే యువకుడి లాకప్ డెత్ నిదర్శనం అన్నారు. అదే సి ఐ వేధింపులతో ఎమ్మార్పీఎస్ నాయకుడి కుమారుడు క్రాంతి కుమార్ ఆత్మహత్య చేసుకోవడం శాంతిభద్రతల వైఫల్యం అన్నారు. ఈ రెండు కేసుల్లో జగన్ జోక్యం చేసుకుంటే గానీ ప్రభుత్వంలో కదలిక రాలేదన్నారు. రాజధానిలో భూముల పూలింగ్ లో స్వచ్ఛందంగా ఇవ్వని రైతుల ఆహ్వానం మేరకు వైసిపి స్టీరింగ్ కమిటీ నాయకులు పర్యటనకు వెళితే కూటమి ప్రభుత్వమే పథకం ప్రకారం రైతులను రెచ్చగొట్టి దాడులు చేయించిందని ఆరోపించారు. ఇష్టంగా ఇస్తే భూములు తీసుకోవాలని అంతేగాని బలవంతంగా లాక్కోకూడదని ఒక సినిమాలో పవన్ కళ్యాణ్ చెప్పిన డైలాగ్ ను గుర్తు చేశారు. వైసిపి నేతలపై దాడులు చేసిన తెలుగుదేశం వారిపై సుమోటుగా ప్రభుత్వం కేసులు పెట్టాలన్నారు. హోం మంత్రి అనిత వ్యక్తిగత మేకప్‌పై వచ్చిన విమర్శలపై వేగంగా స్పందించిన కూటమి ప్రభుత్వ పెద్దలు లాకప్పు డెత్ పై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. హోం మంత్రి శాఖపై పట్టు సాధించాలన్నారు. శాఖల మధ్య సమన్వయం లేదని పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనమ న్నారు. లోకేష్ అమలు చేస్తున్న రెడ్ బుక్కు రాజ్యాంగం చర్యలు నిలిపివేయాలని, తప్పు దోవలో నడుస్తున్న తన కుమారుడు లోకేష్ ను మందలించాలని ఆయన తండ్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు భరత్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్కు రాజ్యాంగం పాలన కాదని, అంబేద్కర్ రాజ్యాంగమే నడుస్తుందని రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు భరోసా ఇవ్వాలన్నారు. రైతుల , ప్రజల ప్రాథమిక హక్కులను కూటమి ప్రభుత్వం కాల రాస్తున్నదని, అక్రమ కేసులతో అణగతొక్కుతున్నదన్నారు. పెద్ద వయసు అని చూడకుండా అంబటి రాంబాబు పై దౌర్జన్యం చేయడం, రాళ్లతో దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. భారత రాజ్యాంగాన్ని గౌరవించే లాగా లోకేష్ కు బుద్ధి చెప్పాలని అన్నారు. నగరంలో వైసిపి శెట్టిబలిజ యువకుడు పీతారామకృష్ణను పోలీసులు పి డి చట్టం ప్రయోగించి సెంట్రల్ జైలుకు పంపించడం ఈవీఎం ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్య అన్నారు. ఆ యువకుడు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా మినహాయింపులు ఇచ్చిందని పోలీసుల తీరుపై చివాట్లు పెట్టిందన్నారు. విశాఖలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు నష్టపరిహారాన్ని కోటి రూపాయలకు పెంచాలని ఎల్జి ఫారం ప్రమాద బాధితులకు తమ ప్రభుత్వ హయాంలో కోటి రూపాయలు చెల్లించామన్నారు. కల్తీ పాలు సంఘటనలో చిన్నారుల వైద్య ఖర్చును భరించాలన్నారు. రాజకీయాల్లో కక్ష సాధింపు చర్యలు తగవని, చట్టం, న్యాయ పరిధిలోనే సమస్యల పరిష్కరించు కోవాల్సిందన్నారు.పాలన రాజ్యాంగానికి లోబడే పనిచేయాలని, రాబోయే రోజుల్లో చర్యలకు ప్రతి చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తండ్రి సమానులు ఎమ్మెల్సీ సోము వీర్రాజు పై తాను గాని, తన డ్రైవర్ గాని అసభ్యంగా తిట్టలేదని స్పష్టం చేశారు. తారకరామా నగర్ లో సుమారు రెండు మూడు కోట్ల రూపాయల పైబడి మౌలిక వసతుల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఆ రోజుల్లో సోము బిజెపి రాష్ట్ర నాయకుడని, తాను వైసీపీ ఎంపీ నని, అప్పటికే తన పై పార్టీ మారే యోచనలో ఉన్నారనే దుష్ప్రచారం జరుగుతున్న సమయంలో తాను ఆయన్ను కలవలేదన్నారు. అలాగే ఇటీవల కంటి వైద్య శిబిరంలో చికిత్స పొందిన వారికి ఈ రోజు సుమారు 250 మందికి ఇవాళ కళ్ల జోళ్ళు పంపిణీ చేసిన భరత్, అలాగే రాబోయే రోజుల్లో ప్రజల ఆరోగ్యం వైద్యం అలాగే యువతకు ఉద్యోగావకాశాలు తన ట్రస్ట్ ద్వారా అందచేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని భరత్ తెలిపారు.

శంభాల నగరంలో

# ఘనంగా ముగిసిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

## శివనామస్మరణతో మహా కుంభాభిషేకం - వైభవంగా సప్తదేవతల కళ్యాణ మహోత్సవం





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలోని గాదరాడ "ఓం శివశక్తి పీఠం - శంబాల నగరం"లో రాజా నగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్మించిన 36ఆలయాల్లో తమిళనాడుకు చెందిన వేద పండితుల ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం అశేష భక్తుల శివనామస్మరణలతో వైభవంగా ముగిసాయి. సోమవారం ఈ మహోత్సవంలో భాగంగా విశేష హోమాలు, జపాలు,పూర్ణాహుతి వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణలతో "మహా కుంభాభిషేకాని" వైభవపేతంగా అశేష భక్తుల శివనామస్మరణలతో నిర్వహించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో కనులారా తిలకించి పరవశించారు .ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ లోక కళ్యాణార్థం సమస్త జీవకోటి మనగడుకు, ఎన్డీఏ ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధి, రాజానగరం నియోజక వర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కాంక్షిస్తూ మహా కుంభాభిషేకాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో వైభవపీతంగా నిర్వహించామన్నారు. వచ్చే కార్తీకమాసంలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీఏ నాయకులు ఆధ్వర్యంలో నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో మరో ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని అందరికీ తెలియజేసి పెద్ద ఎత్తున నిర్వహిస్తానన్నారు. వచ్చే పుష్కరాలకు భక్తులకు వసతితో పాటు రోజుకు సుమారు లక్షమంది భక్తులకు అన్న వితరణకు కార్యాచరణ చేపడుతున్నానన్నారు. అనంతరం సప్త దేవతల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన చిన్నారుల కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని,తీర్థప్రసాదాలు స్వీకరించారు. పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బత్తుల కుటుంబసభ్యులు, వేద పండితులు, ఎన్డీఏ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున విచ్చేశారు.

ఆర్యాపురం బ్యాంకును

# ప్రగతి పథంలో నడిపించడం అభినందనీయం

### ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సాధారణ మహాసభ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 107వ సాధారణ మహాజన సభ శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రం ప్రాంగణంలోని సుబ్రమణ్య మైదానంలో విజయవంతంగా జరిగింది. ఈ మహాజన సభకు హాజరైన ఏ తరగతి మెంబర్లకు ఉపయోగకరమైన మంచి బహుమతులను అందించేందుకు మొత్తం 27 కౌంటర్లను ఏర్పాటు చేశారు. వచ్చే ఖాతాదారులకు ఎలాంటి అసౌకర్యం కలిగిన చికిత్స అందించేందుకు మెడికల్ క్యాంపును కూడా బ్యాంకు చైర్మన్ చల్లా శంకర్రావు నేతృత్వంలో పాలకమండలి ఏర్పాటు చేసింది. ముఖ్య అతిథులుగా రాజమహేంద్రవరం సిటీ శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, రాజమహేంద్రవరం మాజీ శాసన మండలి సభ్యులు ఆదిరెడ్డి అప్పారావు, మాజీ గుడా చైర్మన్ గన్ని కృష్ణ, సీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ పంతం కొండలరావు, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు,చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, జనసేన కార్పొరేషన్ అధ్యక్షుడు వై.శ్రీను, ప్రముఖ వ్యాపారవేత్త చలుమూరి శ్రీనివాస్, ప్రముఖ వైద్యులు డాక్టర్ చలుమూరి తులసీమోహన్, అల్లు బాబీ, బండారు మధుసూదనరావు తదితరులు హాజరయ్యారు. చల్లా శంకర్రావు నేతృత్వంలో పాలకమండలి సభ్యులు బ్యాంకు సిబ్బంది కృషిచేసి ఆర్యాపురం అర్బన్ బ్యాంకును ప్రగతి పథంలో నడిపించడం అభినందనీయమన్నారు. ఖాతాదారుల సౌకర్యార్థం మొబైల్ బ్యాంకింగ్ డిజిటల్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం ఆనందదాయకమన్నారు.బ్యాంకు చైర్మన్ చల్లా శంకర రావు మాట్లాడుతూ గౌరవ మెంబర్లు, బ్యాంకు వ్యవస్థాపకులు స్వర్గీయ సరిపెల్ల విశ్వశ్వర ప్రసాదరావు అందరి ఆశిస్సులతో సమిష్టి కృషితో ఎన్. పి. ఏ తగ్గించి సాఫ్ నుండి బయటికి తీసుకురావడం, డేటా సెంటర్ ను క్లౌడ్ లో పెట్టడం, బ్యాంకు డిపాజిట్లు రూ.717.66 కోట్లు, లోన్స్ రూ.585.05 కోట్లు సాదించడమైనదన్నారు బ్యాంకు డైరెక్టర్లు కప్పల సూర్యప్రకాశరావు, పడాల శ్రీనివాసరావు, పిల్లి శ్యామ్ కుమార్,యర్రమోతు ధర్మరాజు,బుడ్డిగ రవి కొండలరావు, యాళ్ల వెంకటరావు, ముగిది శ్రీనివాసరావు,యెనుముల రంగబాబు, సింగంపల్లి వెంకట రామకృష్ణ, నీలపాల సూర్యనారాయణ, తురకల నిర్మల జి.ఎస్.ఎస్ మురళీ మోహన్, జి సాంబ శివ రావు, గోడే సుధాకర రావు,తాడేల శ్రీనివాస రావు,సెక్రెటరీ గొడే సుధాకరరావు,అసిస్టెంట్ సెక్రెటరి తాడేల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏడిదలో ఆర్యవైశ్య అన్నదాన సత్రం శంకుస్థాపన

### భూమి పూజ చేసిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండలం, ఏడిద గ్రామంలో స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన ఆర్యవైశ్య అన్నదాన సత్రం భవన నిర్మాణ శంఖుస్థాపన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా భూమి పూజ చేసి, కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. ఆకలితో అలమటించే వారికి అన్నదానం చేయడం అన్ని దానాల కన్నా మిన్న అని, అలాంటి పవిత్రమైన కార్యం కోసం అన్నదాన సత్రాన్ని నిర్మించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్వతిన వీర్రాజు, కొలుపోటి సత్యనారాయణమూర్తి, గొడవర్తి ఎర్రబ్బు, మేకా జేజిబాబు, చిట్టూరి ప్రసాద్, రామిశెట్టి రాజ, వెంకటరమణ, పదం ఆనంద్, తుంపాల ఆదినారాయణ, బండారు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# జన విజ్ఞాన వేదిక తూర్పు గోదావరి జిల్లా శాఖ ఎన్నిక

### - జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన లేకపోతే ఆర్థికంగా నష్టపోవలసి వస్తుందంటూ 100 కి 80 శాతం రోగాలు వాటి అంతట అవే పోతాయని 15 శాతం కొద్దిపాటి ఖర్చుతో నయం చేసుకోవచ్చని 5 శాతం రోగాల పట్ల జాగ్రత్తలు తీసుకొని డాక్టర్లను సంప్రదించ వలసి ఉంటుందని డాక్టర్ బ్రహ్మారెడ్డి గౌతమి ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం రాజమండ్రిలో జనవిజ్ఞాన వేదిక ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోవడం, మానవ సంబంధాలు, సమస్య పరిష్కార నైపుణ్యం, నాయకత్వ లక్షణాల వంటివి లేక పోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు తక్కువ అన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణాజీ మాట్లాడుతూ ఈనాడు సమాజంలో మూఢనమ్మకాలు విద్యావంతుల్లోనే ఎక్కువగా ఉన్నాయని, ప్రభుత్వాలు విద్య, ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపటం లేదని, ప్రజల్లో మూఢనమ్మకాలు ఎక్కువగా ఉన్నాయని వీటిని, మేధావులుగా ఉన్నవారు వాటి పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి విశ్వనాథ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక విద్య, ఆరోగ్యం, మూఢనమ్మకాలు, ప్రశ్నించే స్వభావం, శాస్త్రీయ దృక్పథం మరియు సమాజంలో ఉన్నటువంటి రుగ్మతల మీద అవగాహన కల్పిస్తుందని, దీనిలో భాగంగా విద్యార్థులలో గత 38 సంవత్సరాల నుండి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతుందని, మేధావి వర్గం మౌనంగా ఉండకుండా పాల్గొనాలని సమాజ అభివృద్ధి కి తోడ్పడాలని పిలుపు ఇచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు సేతు రామేశ్వర రెడ్డి, జాతీయ సాంస్కృతిక విభాగం కన్వీనర్ దప్పు శీను, రాష్ట్ర ఉపాధ్యక్షులు యోహాన్ బాబు, జాతీయ ఉపాధ్యక్షులు గయాజ్ మాట్లాడుతూ సమాజ హితం కోసం జనవిజ్ఞాన వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. లోకల్ నాయకులు చెక్క తాతారావు, నాగిరెడ్డి, జాన్ బాబు, శ్రీరంగం విశ్వనాథం, మచిలీపట్నం అమర, కె. సుబ్బరాజు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.విశ్వనాథ్ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక, తూర్పుగోదావరి జిల్లా శాఖ కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా ఉందుర్తి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బి.జాన్ బాబు, కోశాధికారిగా విశ్వనాథం, మహిళా విభాగం అధ్యక్షురాలుగా డాక్టర్ సృజన, ముగ్గురు కార్యదర్శులు, ముగ్గురుఉపాధ్యక్షులు ఇద్దరు గౌరవ అధ్యక్షులు మరియు పదిమందికార్యవర్గ సభ్యులను ఎంపిక చేసుకోవడం జరిగింది. ఎన్నికైన నూతన కమిటీకి సభ్యులందరూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# దేవలమహర్షి జయంతి వేడుకలో ఘన నివాళి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వస్త్ర సూత్ర నిర్మాత, దేవతా వస్త్ర ప్రదాత,దేవాంగ కుల మూలపురుషుడు శ్రీ దేవల మహర్షి జయంతి పురస్కరించుకొని రాజేంద్రనగర్ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవల మహర్షి జయంతి వేడుకలను స్థానిక రాజేంద్రనగర్ సంఘం పాక స్కూల్ వద్ద ఉన్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆవరణలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా సంఘ గౌరవ అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు పాల్గొని దేవల మహర్షి జన్మ వృత్తాంతం దేవాంగ జాతి పుట్టుక గురించి సభ్యులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు అల్లంకి మణికంఠ, గౌరవ సలహాదారులు బత్తుల బసవ గణేశ్వర రావు, రెడ్డి శ్రీనివాసరావు, కొడమటి బవ్రరాజు, సహాయ కార్యదర్శి కాలెపు శేఖర్, కాలెపు తిరుమల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్‌లో రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన సదస్సు




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా మండపేట టౌన్ పోలీసులు సోమవారం విజ్ఞాన్ కళాశాలలో రోడ్డు సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండపేట టౌన్ సిఐ సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతతో పాటు గంజాయి నిర్మూలన, ఫోస్కో చట్టం, పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై కూడా విద్యార్థులకు వివరించారు. ఈ సదస్సులో సుమారు 200 మంది విద్యార్థినీ, విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, సమాజ భద్రతలో భాగస్వాములు కావాలని సి ఐ సురేష్ పిలుపునిచ్చారు.

# ఇసుక రీచ్‌లు అనధికారిక స్నానఘాట్‌లలో స్నానం చేయొద్దు

### సీతానగరం పోలీసులు హెచ్చరిక




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల పరిధిలో గోదావరి నదిలోని ఇసుక రీచ్‌లు అనధికారిక స్నాన ఘాట్లు, నూతన ప్రాంతాల్లో ఇటీవల మునిగి మరణించే ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని సీతానగరం పోలీసులు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు యువత భక్తులు మరియు సందర్శకులు నది లోతు, బలమైన నీటి ప్రవాహం,ఇసుక గుంతలు,సుడిగుండాలు అకస్మాత్తుగా పెరిగే నీటిమట్టం అంచనా వేయలేక ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఎగువ ప్రాంతాలనుంచి వరద నీటి విడుదల కారణంగా గోదావరిలో నీటి ప్రవాహం ఎప్పటికప్పుడు మారుతుండడంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రజలు తప్పనిసరిగా నదిలోకి ప్రభుత్వం అను మతించిన సురక్షిత స్నాన ఘట్టాల్లో మాత్రమే స్నానం చేయాలని, పిల్లలు విద్యార్థులను పెద్దల పర్యవేక్షణ లేకుండా నదిలోకి పంపవద్దని, మద్యం సేవించి నదిలోకి దిగరాదని సూచించారు .సెల్ఫీల కోసం లేదా వినోదం కోసం నూతన ప్రాంతాలకు వెళ్ళవద్దని,హెచ్చరిక బోర్డులు భారీ కేడ్లు మరియు పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి 112 కు కాల్ చేయాలని కోరారు. ప్రజల భద్రత కోసం ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పోలీస్ పహారా పెంచడం వంటి చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. పోలీసు శాఖ సూచనలను పాటించి మీ ప్రాణాలను మీ కుటుంబాన్ని కాపాడుకోవాలని కోరారు.



# 'రణబాలి' డైరెక్టర్ బర్త్ డే..

### ఆసక్తికర వీడియోను షేర్ చేసిన విజయ్ దేవరకొండ



టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ- రష్మిక మందన్నా జంటగా నటిస్తోన్న సినిమా రణబాలి. పెళ్లి తర్వాత వీరిద్దరు కలిసి నటిస్తోన్న మొదటి సినిమా కావడంతో ఈ మూవీపై భారీ అంచనాలున్నాయి. దీనికి తోడు హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఈ మూవీలో విలన్ గా కనిపించనున్నాడు. జయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా 'రణబాలి' సినిమా రూపొందుతోంది. ఈ సినిమా సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ కు రాబోతోంది. ఇదిలా ఉంటే ఈ రోజు (జూన్ 29) డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు హీరో విజయ్ దేవరకొండ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు విజయ్ సోషల్ మీడియా పోస్ట్ ద్వారా స్పందిస్తూ - 'మనం టాక్సీవాలా సినిమా చేసి తొమ్మిదేళ్లవుతోంది. ఈ తొమ్మిదేళ్లలో మనం లైఫ్ లో ఎంతో మారిపోయాం. అర్థవంతమైన కథలు రాయాలనే తపన, వాటిని అందంగా తెరకెక్కించాలనే ఇష్టం నీలో ఏమాత్రం తగ్గలేదు. మనం కలిసి చేసింది రెండు చిత్రాలే అయినా ఎన్నో పోరాటాలు చేశాం. మొదటి చిత్రానికి ప్రేక్షకుల ప్రేమ, ఆదరణ అందుకున్నాం. రణబాలితో మనం మరో విజయం సాధించాలి. నువ్వు చేసే పనుల్లో అంతా మంచే జరగాలి. రణబాలిగా నటించే అవకాశం దక్కినందుకు సంతోషిస్తున్నా. మన సినిమాను ప్రేక్షకులు ఎప్పుడెప్పుడు చూస్తారా అని వేచి చూస్తున్నా' అని రాసుకొచ్చారు రౌడీ బాయ్. కాగా తొమ్మిదేళ్ల క్రితం విజయ్ దేవరకొండ-రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్ లో 'ట్యాక్సీవాలా' అనే సినిమా వచ్చింది. ఏ మాత్రం అంచనాలు లేకుండా రిలీజైన ఈ మూవీ సూపర్ హిట్ గా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టింది. ఇప్పుడిదే కాంబోలో మరో సినిమా వస్తుండడంతో రణబాలి పై భారీ అంచనాలున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించి మరిన్ని అప్డేట్స్ రానున్నాయి.

## పెళ్లి మీద తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడానికి కారణం అదే..



ఎస్తేర్ నొరోన్హా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కాగా గతంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలను పంచుకుంది. నటి ఎస్తేర్ నొరోన్హా తన వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా ఆమె గత వివాహం మరియు దాని పర్యవసానాలపై తన లోతైన ఆలోచనలను పంచుకున్నారు. ఎస్తేర్ నొరోన్హా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కాగా గతంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలను పంచుకుంది. నటి ఎస్తేర్ నొరోన్హా తన వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా ఆమె గత వివాహం మరియు దాని పర్యవసానాలపై తన లోతైన ఆలోచనలను పంచుకున్నారు. ఆమె తన విడాకులను జీవితంలో పశ్చాత్తాపంగా చూడటం లేదని, బదులుగా అది ఒక ముఖ్యమైన గుణపాఠమని స్పష్టం చేశారు. ఒక అధ్యాయం ముగిసినా, కొత్త పాఠాలను నేర్చుకున్నానని ఆమె తెలిపారు. ఎస్తేర్ తనను తాను ఎక్కువగా ఆలోచించే వ్యక్తిగా అభివర్ణించుకుంటూ, అన్ని విషయాల గురించి లోతైన అవగాహన ఉన్నప్పటికీ, తన జీవితంలో కొన్ని సంఘటనలు ఎలా జరిగాయని ఆశ్చర్యపోతానని చెప్పారు. ఎవరూ పరిపూర్ణులు కారని, ప్రతి ఒక్కరికీ బలహీనతలు ఉంటాయని ఆమె గుర్తించారు. కొన్నిసార్లు ఈ బలహీనతలను మనం గుర్తించలేకపోవచ్చని లేదా ప్రేమలో ఉన్నప్పుడు వాటిని పట్టించుకోకపోవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే, తన విషయంలో తాను గుడ్డిగా ప్రేమలో లేనని ఎస్తేర్ చెప్పుకొచ్చింది. భారతీయ సమాజంలో పాతుకుపోయిన మైండ్‌సెట్‌ను ఎస్తేర్ ప్రముఖంగా ప్రస్తావించారు. 25 లేదా 30 ఏళ్లు దాటితే పెళ్లి చేసుకోవాలనే ఒత్తిడి సర్వసాధారణమని, ఈ ఒత్తిడి యువతను తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడానికి పురికొల్పుతుందని ఆమె అన్నారు. "నాకు కూడా ఒక బాయ్‌ఫ్రెండ్ ఉండాలి," "నేను వ్యక్తిగత జీవితంలో వెనుకబడి ఉండకూడదు" అనే భావన ఈ సామాజిక ఒత్తిడి నుంచి వస్తుందని ఆమె అన్నారు. విడాకుల రేటు పెరగడానికి ఇది ఒక ముఖ్య కారణమని ఆమె పేర్కొన్నారు, ఎందుకంటే విద్య, కెరీర్‌లో ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ, ఈ ఒత్తిడికి లోనై సంబంధాలలోకి ప్రవేశిస్తున్నారని తెలిపారు. తన విడాకులు ఒక "డామేజ్ కంట్రోల్" అని ఎస్తేర్ అన్నారు.

### పాత్ర కోసం రెడీ అవ్వడానికి రెండు గంటలు పట్టింది..

# చాలా నియమనిష్టలతో పని చేశాం : నభా నటేష్



నాగబంధంలో ఇప్పటివరకూ చేయని స్ట్రాంగ్ క్యారెక్టర్ చేశాను. సినిమా విజువల్ వండర్ లా ఉంటుంది. ఆడియన్స్ ఖచ్చితంగా సర్‌ప్రైజ్ అవుతారని హీరోయిన్ నభా నటేష్ చెప్పుకొచ్చింది. అలాగే నాగబంధం సినిమా గురించి మరిన్ని ఆసక్తికర విషయాలను పంచుకుంది అందాల తార నభా నటేష్. విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం - ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ నభా నటేష్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. నభా నటేష్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఇలాంటి పాత్ర నేను చేయలేదు. ఇందులో నేను పార్వతి పాత్రలో కనిపిస్తాను. తను ఒక వేద విద్యార్థిని. తన పాత్ర ఎమోషనల్‌గా చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. తన కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా నిలబడే వ్యక్తిత్వం ఆమెది. కథలో నా పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. పార్వతి తీసుకునే ప్రతి నిర్ణయం కథపై ప్రభావం చూపుతుంది. నా పాత్ర చూసి ప్రేక్షకులు తప్పకుండా సర్ప్రైజ్ అవుతారు. ఇందులో చాలా గ్రాండ్‌గా చిత్రీకరించిన డాన్స్ నంబర్ ఉంది ఆ పాట చేయడం నిజంగా అద్భుతమైన అనుభవం. దాదాపు 5,000 మంది డ్యాన్సర్లతో ఆ పాటను గణేష్ ఆచార్య మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. అందులో క్లాసికల్ డాన్స్ కూడా ఉంటుంది. నిజంగా ఆ పాట బిగ్ స్క్రీన్‌పై అద్భుతంగా కనిపిస్తుంది. అలాంటి పాటను నేను ఇప్పటివరకు చేయలేదు. అది నాకు చాలా కొత్త అనుభవం. టెక్నికల్‌గా కూడా అంత పెద్ద కాన్వాస్‌పై ఆ పాటను చిత్రీకరించడం ఒక ఛాలెంజ్. అది కేవలం డాన్స్ సాంగ్ మాత్రమే కాదు... అందులో భక్తి భావం కూడా కనిపించాలని దర్శకుడు, కొరియోగ్రాఫర్‌కు ముందుగానే సూచించారు. ఆ పాట కోసం వేసిన సెట్ నిజంగా ఒక పండుగ వాతావరణాన్ని గుర్తు చేస్తుంది. ఈ సినిమా కోసం నిర్మించిన అనంత పద్మనాభస్వామి ఆలయ సెట్ నిజంగా ఆలయంలోకి వెళ్లిన అనుభూతిని కలిగిస్తుంది. ఆ సెట్‌ను చూసిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. ప్రేక్షకులను కూడా ఆ విజువల్స్ తప్పకుండా మెస్మరైజ్ చేస్తాయి. అలాగే ఈ సినిమాలో నా పాత్ర కోసం రెడీ అవ్వడానికి దాదాపు రెండు గంటలు పట్టేది. ప్రతి కాస్ట్యూమ్ విషయంలో ఎంతో జాగ్రత్త తీసుకున్నారు. ఈ షూటింగ్‌ను నేను చాలా ఎంజాయ్ చేశాను. ఇలాంటి సినిమాల్లో నటించే అవకాశం చాలా అరుదుగా వస్తుంది. ఈ సినిమా కోసం దాదాపు పది భారీ సెట్లు వేశారు. ప్రతి సెట్ ఒకదానికొకటి భిన్నంగా ఉంటుంది. ఇలాంటి భారీ చిత్రంలో నటించడం ఒక నటిగా నాకు గొప్ప అనుభవం. అనంత పద్మనాభస్వామి ఆలయ సెట్‌లో షూటింగ్ చేస్తున్నప్పుడు మేమంతా చాలా నియమనిష్టలతో పని చేశాం. పూర్తిగా శాకాహారులుగా ఉన్నాం. అలాగే అక్కడ ఒక అర్చకుడిని నియమించి ప్రతిరోజూ పూజలు చేసిన తర్వాతే షూటింగ్ ప్రారంభించేవాళ్లం. అలాగే ఈ సినిమాలో రొమాన్స్ ఉంటుంది. అయితే దానికంటే చాలా ముఖ్యమైన అంశాలు నా పాత్రలో ఉంటాయి. అవే కథకు కీలక మలుపు తీసుకొస్తాయి. ప్రేక్షకులు తప్పకుండా సర్ప్రైజ్ అవుతారు. కథకు బలం చేకూర్చే పాత్రలో కనిపిస్తాను. ఇప్పటివరకు నేను చేసిన పాత్రలకు పూర్తిగా భిన్నమైన పాత్ర ఇది. ఈ పాత్ర చేసినందుకు చాలా గర్వపడుతున్నాను అని తెలిపింది. అలాగే నాకు ఒక చిన్న యాక్సిడెంట్ జరిగింది. దాని వల్ల భుజానికి గాయం అయింది. ఆ కారణంగా దాదాపు ఏడాదిన్నర పాటు బ్రేక్ తీసుకున్నాను. ఫిజికల్‌గా, మెంటల్‌గా పూర్తిగా స్ట్రాంగ్‌గా ఉన్నప్పుడే సినిమాలు చేయాలి. స్క్రీన్‌పై ఎనర్జీతో కనిపించినప్పుడే పాత్రకు న్యాయం చేయగలనని భావిస్తాను. అందుకే పూర్తిగా కోలుకున్న తర్వాతే మళ్లీ నటించడం ప్రారంభించాను.




### అక్కడ 24 క్యారెట్ల

## బ్యాటింగ్ పిచ్‌లు ఉండవ్ : అశ్విన్



ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్‌లో భారత బ్యాటర్ల వైఫల్యంపై భారత మాజీ ఆల్ రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందించాడు. ఇంగ్లాండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ముందు భారత బ్యాటర్లకు ఐర్లాండ్ సిరీస్ నుంచి గుణపాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపాడు. "ఐపీఎల్‌లో భారత బ్యాటర్లు బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లపై ఆడి అలాంటి ఆటకు అలవాటు పడ్డారు. విదేశాల్లో బౌలర్లకు సహకరించే పిచ్‌లపై ఆడాల్సి వచ్చినప్పుడు అది వారికి సవాలుగా మారుతోంది. ఐపీఎల్‌లో మాదిరిగా బ్యాటింగ్‌కు అనుకూలమైన 24 క్యారెట్ల పిచ్‌లు అక్కడ ఉండవు. ఐపీఎల్ వల్ల భారత బ్యాటింగ్ బలపడింది. కానీ, అంతర్జాతీయ క్రికెట్‌లో బౌలర్లకు అనుకూలంగా ఉండే పిచ్‌లపై వారి సామర్థ్యానికి పరీక్ష ఎదురవుతుంది. అలాంటి సమయంలో టీమ్‌ఇండియా బ్యాటర్లు ఇబ్బందులు పడే అవకాశం ఉంది" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.

### 2028 ఒలింపిక్స్.. అర్హత సాధించిన

## భారత మహిళల క్రికెట్ జట్టు



టీ20 ప్రపంచ కప్ 2026లో గ్రూప్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించి బాధలో ఉన్న భారత మహిళల క్రికెట్ జట్టుకు గుడ్‌న్యూస్. 2028 ఒలింపిక్స్‌కు హర్మన్‌ప్రీత్ సేన అర్హత సాధించింది. ఈ మేరకు ఐసీసీ, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ధ్రువీకరించాయి. ప్రస్తుతం జరుగుతున్న మహిళల టీ20 ప్రపంచ కప్‌లో టీమ్‌ఇండియా సెమీ ఫైనల్స్‌కు చేరుకోలేకపోయింది. అయితే, ఈ టోర్నీలో ఆసియా తరఫున భారత్ అత్యుత్తమ ప్రదర్శన చేసింది. దీంతో భారత జట్టు ఒలింపిక్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా కూడా క్వాలిఫై అయ్యాయి. అమెరికాలోని లాస్ ఏంజెలెస్ వేదికగా 2028 ఒలింపిక్ గేమ్స్ జరగనున్నాయి. 1900లో ఒక్కసారి మాత్రమే ఒలింపిక్స్‌లో భాగమైన క్రికెట్.. 2028లో పునరాగమనం చేయబోతున్న సంగతి తెలిసిందే. లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీలను ఆరు జట్లతో నిర్వహించనున్నారు.

# ఐర్లాండ్‌లో అవమానానికి ఇంగ్లాడ్‌లో ప్రతీకారం..




ఐర్లాండ్ చేతిలో తిన్న దెబ్బ నుంచి టీమిండియా ఎంత త్వరగా కోలుకుంటే అంత మంచిది. పాత తప్పులను పక్కన పెట్టి, ఇంగ్లాండ్ పిచ్‌లపై సరికొత్త వ్యూహాలతో దూకుడు ప్రదర్శిస్తేనే భారత్ తన నెంబర్ వన్ స్థానాన్ని కాపాడుకోగలదు. మరి ఈ ప్రతిష్టాత్మక సిరీస్‌లోనైనా మన ఆటగాళ్లు పూర్వ వైభవాన్ని అందుకుంటారో లేదో చూడాలి. ప్రపంచ నెంబర్ వన్ టీ20 జట్టుగా మురిసిపోతున్న భారత క్రికెట్ జట్టుకు పసికూన ఐర్లాండ్ ఊహించని షాక్ ఇచ్చింది. చివరి మ్యాచ్‌లో కేవలం ఒక్క పరుగు తేడాతో ఓడిపోయి సిరీస్‌ను కోల్పోవడం అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘోర పరాభవం తర్వాత టీమిండియా వెంటనే ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌కు సిద్ధమవుతోంది.

**మూడేళ్ల విజయ పరంపరకు బ్రేక్.. ఐర్లాండ్ గడ్డపై అవమానకర క్లీన్ స్వీప్..!**

బెల్‌ఫాస్ట్ వేదికగా ఆదివారం రాత్రి ఉత్కంఠభరితంగా జరిగిన చివరి టీ20 మ్యాచ్‌లో భారత జట్టు కేవలం ఒక్క పరుగు తేడాతో ఓడిపోయింది. దీంతో ఆతిథ్య ఐర్లాండ్ జట్టు టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. గత మూడేళ్లుగా టీ20 సిరీస్‌లలో ఓటమనేదే ఎరుగని భారత ఆధిపత్యానికి ఈ ఓటమితో తెరపడింది. గతంలో 2019లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఇలా వైట్ వాష్‌కు గురికాగా, మళ్లీ ఇన్నాళ్లకు టీ20ల్లో పెద్దగా రికార్డు లేని ఐర్లాండ్ చేతిలో క్లీన్ స్వీప్ అవ్వడం భారత క్రికెట్ చరిత్రలోనే ఒక అవమానకరమైన రికార్డుగా మిగిలిపోనుంది.

**అభిమానుల్లో ఆందోళన.. ఇంగ్లాండ్ పర్యటనపై నీలినీడలు..!**

ఐర్లాండ్ వంటి చిన్న జట్టుతోనే ఇంత దారుణంగా ఆడితే, ఇక ప్రపంచంలోనే అత్యంత బలమైన జట్లలో ఒకటైన ఇంగ్లాండ్‌ను వారి సొంత గడ్డపై ఎలా ఎదుర్కొంటారనే ఆందోళన అభిమానుల్లో వ్యక్తమవుతోంది. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే భారత జట్టు ఇంగ్లాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అసలు మ్యాచ్‌లు ఎప్పుడు జరుగుతాయి, ఎక్కడ జరుగుతాయి అనే విషయాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ టీ20 సిరీస్ పూర్తి షెడ్యూల్:**

రాబోయే ప్రతిష్టాత్మక ఇంగ్లాండ్ పర్యటనకు సంబంధించిన ఐదు టీ20 మ్యాచ్‌ల పూర్తి వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి:

తొలి టీ20 మ్యాచ్: జులై 1వ తేదీన చెస్టర్ లీ స్ట్రీట్ వేదికగా జరుగుతుంది.

రెండో టీ20 మ్యాచ్: జులై 4వ తేదీన మాంచెస్టర్ వేదికగా నిర్వహిస్తారు.

మూడో టీ20 మ్యాచ్: జులై 7వ తేదీన నాటింగ్హామ్ వేదికగా జరుగుతుంది.

నాలుగో టీ20 మ్యాచ్: జులై 9వ తేదీన బ్రిస్టల్ వేదికగా సాగుతుంది.

ఐదో టీ20 మ్యాచ్: జులై 11వ తేదీన సౌతాంప్టన్ వేదికగా చివరి మ్యాచ్ జరగనుంది.

**మ్యాచ్ సమయాలు, ఉచిత ప్రత్యక్ష ప్రసార వివరాలు..**

ఈ సిరీస్‌లోని మ్యాచ్ సమయాల విషయానికి వస్తే అభిమానులు కొంచెం అప్రమత్తంగా ఉండాలి. మాంచెస్టర్‌లో జరిగే రెండో టీ20, సౌతాంప్టన్‌లో జరిగే ఐదో టీ20 మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం రాత్రి 7:00 గంటలకు ప్రారంభమవుతాయి. అయితే మిగిలిన మూడు టీ20 మ్యాచ్‌లు మాత్రం రాత్రి 10:00 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఈ టీ20 సిరీస్ ముగిసిన వెంటనే జులై 14 నుంచి మూడు వన్డేల సిరీస్ కూడా ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లను టీవీల్లో చూడాలనుకునే వారు స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో వీక్షించవచ్చు. మొబైల్ లేదా ఓటీటీలో చూడాలనుకునే వారు జియో సినిమా లేదా హాట్‌స్టార్ ద్వారా చూడవచ్చు. ముఖ్యంగా జియో సిమ్ వాడుతున్న వినియోగదారులు ఈ మ్యాచ్‌లను పూర్తిగా ఉచితంగా ఆస్వాదించవచ్చు.

## అతన్ని పక్కనబెట్టి.. వైభవ్ సూర్యవంశీని ఆడించాలా? కోచ్ సీరియస్



ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌లో టీమిండియా దారుణ ఓటమి చవిచూసింది. ప్రపంచ ఛాంపియన్ల హోదాలో ఓడిపోవడంపై గౌతమ్ గంభీర్, శ్రేయస్ అయ్యర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీని ఆడించకపోవడం వల్లే ఓటమి అంటూ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, అసిస్టెంట్ కోచ్ సంజూ శాంసన్‌ను సమర్థించారు. తాజాగా ఐర్లాండ్‌తో జరిగిన రెండు టీ20ల సిరీస్‌లో టీమిండియా దారుణ ఓటమిని చవిచూసింది. టీ20 వరల్డ్ కప్ 2026 గెలిచిన తర్వాత వరల్డ్ ఛాంపియన్స్‌గా ఆడిన తొలి సిరీస్‌లో, అది కూడా ఐర్లాండ్ వంటి పసికూన టీమ్‌తో ఆడి దారుణంగా రెండుకు రెండు మ్యాచ్‌లు ఓడిపోయారు. దీంతో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా యంగ్ ప్లేయర్, వండర్ బాయ్ వైభవ్ సూర్యవంశీని రెండు మ్యాచ్‌ల్లో కూడా ఆడించకపోవడం వల్లే టీమిండియా ఓడిపోయిందని, అతన్ని ఎందుకు ఆడించలేదని కూడా క్రికెట్ అభిమానులు మండిపడుతున్నారు. అయితే సిరీస్ ముగిసిన తర్వాత టీమిండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్‌డస్కటే మీడియాతో మాట్లాడుతూ.. వైభవ్ సూర్యవంశీ విషయంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైభవ్ నిజంగా అద్భుతమైన ప్లేయర్ అని చెబుతూనే.. అతన్ని ఆడించేందుకు తాము సంజూ శాంసన్‌ను పక్కనపెట్టలేమని అన్నారు. సంజూ శాంసన్ మూడు నెలల క్రితమే తమకు టీ20 వరల్డ్ కప్ అందించాడని, అలాంటి బ్యాటర్‌ను ఎలా పక్కనపెట్టాలంటూ ప్రశ్నించారు. సో.. వైభవ్ కోసం సంజూ అన్యాయం చేయలేమనే విధంగా టెన్ దస్కటే మాట్లాడారు. అయితే సంజూ శాంసన్ మాత్రం వరుసగా రెండు మ్యాచ్‌ల్లోనూ దారుణంగా విఫలం అయ్యాడు. తొలి మ్యాచ్‌లో 5 పరుగులు బౌల్డ్ అయిన శాంసన్, రెండో మ్యాచ్‌లో ఇన్నింగ్స్ తొలి బంతికే ఎల్బీడబ్ల్యూ అయ్యాడు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com